సాక్షి 24|7
పశ్చిమగోదావరి
మంగళవారం 1-8-2017

7లో అతిక్రమణకు తప్పదు మూల్యం
వాహనచోదకులూ తస్మాత్ జాగ్రత్త

8లో నాటకాల్లో మెగాస్టార్ మద్దాల
రంగస్థల కళాకారుడు రామారావు కన్నుమూత

11లో ముగిసిన టీచర్ల బదిలీల కౌన్సెలింగ్
ఊపిరిపీల్చుకున్న విద్యాశాఖాధికారులు

ఆక్వాపార్క్ ఆగడం

- పక్కపొలాల్లోకి మోటార్లతో నీరు తోడకం
- ప్రశ్నించినా స్పందించని యాజమాన్యం
- స్థానికుల ఆగ్రహంతో కదిలిన అధికారులు
- ఇప్పటివరకూ చెప్పినవన్నీ వట్టిమాటలే..!
- పార్క్ వ్యతిరేక పోరాట సమితి నేతల ఆందోళన



గోదావరి మెగా ఆక్వా ఫుడ్‌పార్క్

సాక్షి ప్రతినిధి, ఏలూరు :

తుందుర్రులో నిర్మిస్తున్న గోదావరి మెగా ఆక్వా ఫుడ్‌పార్కు యాజమాన్యం వైఖరి విమర్శలకు దారి తీస్తోంది. ప్రాజెక్టు పూర్తయితే ఒక్క చుక్క నీరూ బయటకు రాదని, వచ్చిన వృథా నీటిని తమ ప్రాంగణంలోనే మొక్కలకు తరలిస్తామని ఇప్పటివరకూ చెబుతూ వస్తున్న యాజమాన్యం.. ఆదివారం ఆ మాటలకు తిలోదకాలిచ్చింది. దీనికి ఈ చిత్రమే నిదర్శనం. ఆదివారం కురిసిన కొద్దిపాటి వర్షానికే ఫ్యాక్టరీలో నీరు నిలిచిపోవడంతో వాటిని మోటార్లతో బయట ఉన్న పొలాల్లోకి తోడివేసింది. ఇది వివాదానికి దారితీసింది. ఫ్యాక్టరీలో

మిగతా 2వ పేజీలో



ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో రాత్రి 8.15 గంటలకూ రిజిస్ట్రేషన్లకు పోటీపడుతున్న కక్షిదారులు

ఒక్కరోజు ఆదాయం రూ. 7 కోట్లు

- రిజిస్ట్రేషన్ల సంఖ్య : 2 వేలు
- సర్కారుకు భారీగా ఆదాయం
- స్థిరాస్తుల ధరల పెంపు ప్రభావం
- నేటి నుంచి కొత్త ధరలు అమలు

ఆగస్టు 1 మంగళవారం నుంచి స్థిరాస్తుల పాత ధరలకు సర్కారు మంగళం పాడనుండడంతో సోమవారం జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. ఈ ఒక్క రోజే జిల్లావ్యాప్తంగా రెండు వేల రిజిస్ట్రేషన్లు జరిగాయి. రూ.ఏడు కోట్ల ఆదాయం లభించింది. రిజిస్ట్రేషన్ శాఖకు సోమవారం హ్యాపీ మండే అయింది.

తాడేపల్లిగూడెం/జంగారెడ్డిగూడెం :

ఆషాఢం ముగింపు ఆఫర్‌గా సర్కారు జిల్లాలోని స్థిరాస్తుల విలువలను పెంచింది. ఆగస్టు 1 నుంచి కొత్త ధరలు అమలవుతాయని గతంలోనే ప్రకటించింది. దీంతో ఆషాఢం పూర్తయిన తర్వాత జూలై 23 నుంచి ఆస్తుల రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయి. అప్పటి నుంచి

మిగతా 2వ పేజీలో



మరో నెల

- బీపీఎస్‌కు చాన్స్
- జూలై 31తో ముగిసిన గడువు
- ఆగస్టు నెలాఖరు వరకూ పొడిగింపు
- దరఖాస్తుల పరిష్కారంలో శ్రద్ధేదీ!
- అధికారుల తీరుపై విమర్శలు


కొవ్వూరు :

పట్టణ, నగరాల్లో ఉన్న అనధికారిక భవనాల క్రమబద్ధీకరణ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్)కు ప్రభుత్వం ఇచ్చిన గడువు సోమవారంతో ముగిసింది. ఈ పథకం ద్వారా జిల్లాకు అపరాధ రుసుం రూపంలో రూ.38.80 కోట్ల మేరకు

మిగతా 2వ పేజీలో

జిల్లాలో బీపీఎస్ తీరిది..

మొత్తం పుర, నగరపాలక సంస్థలు 9



మొత్తం దరఖాస్తులు : 4,635

పరిష్కరించినవి : 3,437

పెండింగ్‌లో ఉన్నవి : 1,170

ఇప్పటివరకూ ఆదాయం రూ. 38.80 కోట్లు

మరో నెల

మొదటి పేజీ తరువాయి

ఆదాయం సమకూరింది. జిల్లావ్యాప్తంగా 4,635 దరఖాస్తులు బీపీఎస్ కోసం రాగా, వీటిలో 3,437 దరఖాస్తులను పరిశీలించి, అపరాధరుసుంతో అధికారులు పరిష్కరించారు. ఇంకా జిల్లాలో 1,170 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో వివిధ కారణాలతో 28 దరఖాస్తులను తిరస్కరించారు. ప్రభుత్వం రెండేళ్ల క్రితం బీపీఎస్ ద్వారా భవనాలను క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. ఈ గడువు సోమవారం సాయంత్రంతో ముగియడంతో ప్రభుత్వం మరో నెలరోజుల పాటు గడువు పొడిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు నెలాఖరు వరకు మరోసారి గడువు ఇస్తూ ఉత్తర్వులిచ్చింది.

పరిష్కారంలో కొరవడిన శ్రద్ధ

బీపీఎస్ ద్వారా భవనాన్ని క్రమబద్ధీకరించుకునే వారు దరఖాస్తుతో పాటు రూ.10 వేలు చెల్లించాలి. అధికారులు భవనాన్ని పరిశీలించి నిబంధనల ఏ మేరకు అతిక్రమించారో పరిశీలించి అపరాధ రుసుము నిర్ణయిస్తారు. దీనిలో కొన్నిచోట్ల అధికారులు దరఖాస్తులు పరిష్కారంపై తగిన శ్రద్ధ చూపలేదన్న విమర్శలు ఉన్నాయి.అగ్నిమాపక శాఖ నుంచి ధ్రువీకరణ పత్రాలు రాకపోవడంతో కొన్ని పెండింగ్‌లో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. కొన్ని దరఖాస్తులు కమిషనర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కారంపై టౌన్‌ప్లానింగ్ అధికారులు శ్రద్ధ చూపకపోవడం, కాలయాపన చేయడం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలో పాలకొల్లు పురపాలక సంఘం దరఖాస్తుల పరిష్కారంలో ముందంజలో ఉంది. ఇక్కడ 566 దరఖాస్తులు వస్తే 542 పరిష్కారమయ్యాయి. దీంతో ఆ పురపాలక సంఘానికి రూ.5 కోట్ల మేర ఆదాయం లభించింది. భీమవరంలో అత్యధికంగా 1,155 దరఖాస్తులు వస్తే, తణుకులో 1,087 అర్జీలు వచ్చాయి.

28 దరఖాస్తుల తిరస్కరణ

జిల్లా వ్యాప్తంగా అనధికారిక నిర్మాణాల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తుల్లో 28 వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. వీటిలో తాడేపల్లిగూడెంలో 19, తణుకులో ఆరు, ఏలూరు నగర కార్పొరేషన్, జంగారెడ్డిగూడెం నగర పంచాయతీ, పాలకొల్లు పురపాలక సంఘాల్లో ఒక్కో దరఖాస్తు ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

భవనాల క్రమబద్ధీకరణకు సోమవారంతో గడువు ముగిసింది. ప్రభుత్వం మరోనెల గడువుపొడిగించింది. ఆగస్టు నెలాఖరు వరకు భవనాలను క్రమబద్ధీకరించుకోవచ్చు. కొన్ని దరఖాస్తులు అగ్నిమాపక ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో పెండింగ్‌లో ఉన్నాయి. ఇలాంటివారికి గడువు చక్కని అవకాశం.

– పొట్లూరి సాయిబాబా, రీజినల్ డైరెక్టర్, టౌన్‌ప్లానింగ్

28 నుంచి స్పెషల్ డ్రైవ్ పరీక్షలు

ఏయూక్యాంపస్(విశాఖతూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో స్పెషల్ డ్రైవ్ పరీక్షలను ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎన్.హనుమంత రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ అవుట్ గేట్ వద్దనున్న ఎంబీఏ అనెక్చర్ భవనంలో పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఏయూ వెబ్‌సైట్ రీరీరీ. ృఖ్చా. జీుజా లో కోర్సుల వారీగా పరీక్షల తేదీలు, సమయాలు ఉంచడం జరుగుతుందన్నారు. హాల్‌టికెట్లను ఏయూ పరీక్షల విభాగంలో పరీక్ష తేదీకి మూడు రోజుల ముందునుంచి పొందవచ్చన్నారు.

ఒక్కరోజు ఆదాయం రూ.7కోట్లు

మొదటి పేజీ తరువాయి

కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. రోజుకు 30 నుంచి 50 రిజిస్ట్రేషన్లు జరుగుతూనే ఉన్నాయి.

పోటెత్తిన కక్షిదారులు

సోమవారం పాత ధరలకు ఆఖరి రోజు కావడంతో కక్షిదారులు భారీ సంఖ్యలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పోటెత్తారు. జిల్లాలో రెండు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో ఏలూరు జిల్లా పరిధిలో వెయ్యి, భీమవరం జిల్లా పరిధిలో వెయ్యి రిజిస్ట్రేషన్లు ఒక్క సోమవారమే జరిగాయి. వీటి ద్వారా సుమారు రూ.ఏడు కోట్ల ఆదాయం వచ్చింది.



రద్దీగా ఉన్న నల్లజర్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

అనామలిస్ కమిటీల సిఫార్సుల మేరకు..

అనామలిస్ కమిటీల సిఫార్సుల మేరకు స్థిరాస్తుల విలువ పెంపు జరిగింది. గత ఏడాది ఉన్న విలువకు అదనంగా కనీసం 40 శాతం నుంచి 50 శాతం వరకు పెంచాలని సర్కారు నిర్ణయించింది. పెద్దనోట్ల రద్దు తర్వాత ఆస్తుల రిజిస్ట్రేషన్ వ్యవహారాలు అంత జోరుగా సాగడంలేదు. ఏదో తప్పదులే అన్నట్టుగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. వాస్తవానికి పెద్ద నోట్ల రద్దు వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయింది. దీంతో ఆదాయం పెంచుకునే క్రమంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

కొన్నిచోట్ల పాతధరలే

జిల్లాలో రిజిస్ట్రేషన్ల ద్వారా నెలకు రూ.70 నుంచి రూ.80 కోట్ల ఆదాయం ఉంటుందని అంచనా. దీనిని మరింత పెంచుకునే క్రమంలోనే సర్కారు స్థిరాస్తుల విలువను పెంచినట్టు తెలుస్తోంది. జిల్లాలో వివిధ ప్రాంతాల మార్కెట్ ధరలను అనుసరించి భూముల ధరలను పెంచాలని అధికారులు నిర్ణయించారు. సాధారణంగా ఉన్న విలువలకు కొన్ని చోట్ల అదనంగా 20 శాతం మాత్రమే పెంచారు. మరికొన్ని చోట్ల పాత ధరలనే కొనసాగించాలని నిర్ణయించారు. భూసేకరణ అవకాశాలు ఉన్నచోట భూముల విలువలను పెంచాలనే ప్రతిపాదనలను రిజిస్ట్రేషన్ శాఖ చేసినా, అనామలిస్ కమిటీ వీటికి అనుమతి ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన భూసేకరణ కొత్త చట్టం ప్రకారం అవసరాల కోసం భూమిని తీసుకుంటే రిజిస్ట్రేషన్ విలువకు అదనంగా మూడు రెట్లు ఇవ్వాల్సి ఉండడంతో ఇది అదనపు భారంగా మారే ప్రమాదం ఉండడంతో అనామలిస్ కమిటీ ఇలాంటి ప్రతిపాదనలకు బ్రేక్ వేసింది.

మునిసిపల్ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ల జోరు

జిల్లాలో సోమవారం మునిసిపల్ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ల జోరు ఎక్కువగా కనిపించింది. ఏలూరు రిజిస్ట్రార్ జిల్లాలో ఏలూరు, భీమడోలు, నిడదవోలు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, కొవ్వూరులలో భారీగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఒక్క తాడేపల్లిగూడెంలో వంద వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. చిన్నసబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తక్కువగా జరిగాయి. కామవరపుకోట, వేగేశ్వరపురం వంటి చోట తక్కువగా రిజిస్ట్రేషన్లు జరిగాయి.

కొనుగోలుదారులకు భారం

ప్రధాన పట్టణాల్లో వ్యవసాయ భూములకు ఎకరానికి అదనంగా లక్ష పెంచారు. ఇదే రియల్ ఎస్టేట్ రంగంలో ఫ్లాట్‌లకు గజానికి రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు పెంచారు. ప్రధాన పట్టణాలకు సరిహద్దుగా ఉన్న గ్రామాలకు మాత్రం గజానికి రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు పెంచారు. అలాగే వ్యవసాయ భూముల ధరలూ ఎక్కువగానే పెంచారు. అమ్మకందారులకు ఇది శుభవార్తే అయినా.. కొనుగోలుదారులకు మాత్రం అదనపు భారమవుతోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా 7.5 శాతం రిజిస్ట్రేషన్ చెల్లించాలి కాబట్టి రిజిస్ట్రేషన్ చార్జి కూడా పెరుగుతుంది. దీంతో సామాన్యుడు ఇంటి స్థలం కొనుగోలు చేయాలంటే అసాధ్యమేనని చెప్పాలి.

రియల్ ఎస్టేట్‌పై ప్రభావం

జిల్లాలో ఇప్పటికే భూముల రిజిస్ట్రేషన్ ధరలు అధికంగా ఉన్నాయి. 2014లో భూముల రిజిస్ట్రేషన్ ధరలు విపరీతంగా పెంచారు. దీంతో రియల్ ఎస్టేట్‌పై తీవ్ర ప్రభావం చూపింది. ఇదిలా ఉంటే రాష్ట్రం విడిపోవడం, 2014లో రిజిస్ట్రేషన్ ధరలు పెంచడం వల్ల జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. భూములు, ఇళ్ల స్థలాలు కొనుగోలుకు పెరిగిన ధరలు ఆటంకం కావడంతో ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఇదిలా ఉంటే పెద్ద నోట్ల రద్దు, ఒకవైపు ఆన్‌లైన్ లావాదేవీలు, మరోవైపు జీఎస్టీ కారణంతో తమ వద్ద ఉన్న సొమ్మును బహిర్గతం చేసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో భూముల క్రయ విక్రయాలు పడిపోయాయి. ఈ నేపథ్యంలో మళ్లీ రిజిస్ట్రేషన్ ధరలు పెరిగితే.. దీని ప్రభావం రియల్ ఎస్టేట్ రంగంపై మరింతగా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

జంగారెడ్డిగూడెంకు మినహాయింపు

జిల్లాలో జంగారెడ్డిగూడెం సబ్‌రిజిస్ట్రార్ కారాల్యయ పరిధిలో మాత్రం ధరలు పెంచలేదు. ఈ ప్రాంతంలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి భూములు సేకరిస్తున్న నేపథ్యంలో ఇక్కడ భూముల విలువ పెంచలేదు.

ఆక్వాపార్క్ ఆగడం

మొదటి పేజీ తరువాయి

నిలిచిపోయిన నీటిని పెద్ద మోటార్‌తో ఎగువన ఉన్న పంట పొలాల్లోకి ఆదివారం రాత్రి నుంచి తోడటం మొదలు పెట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ ప్రతినిధులను సంప్రదించారు. అయినా వారి నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడంతో పోరాటకమిటీ నేత ఆరేటివాసు వ్యవసాయ శాఖ ఏడీ దృష్టికి తీసుకువచ్చారు. తొలుత ఇది క్రిమినల్ వ్యవహారమని, పోలీసులకు ఫిర్యాదు చేసుకోవాలని చెప్పిన అధికారులు.. ఆ తర్వాత మండల తహసీల్దార్, వీఆర్ఓ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వీఆర్ఓ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి ఫ్యాక్టరీ ప్రతినిధులతో మాట్లాడి ఆ మోటార్‌ను కట్టివేయించారు.

రైతుల ఆగ్రహం

ఇప్పటికే ఈ ప్రాజెక్టు రావడం వల్ల సమీప పొలాలను పూడ్చివేయడంతో ఫ్యాక్టరీకి ఎగువభాగంలో ఉన్న నాలుగు వందల ఎకరాల్లో రెండో పంట వేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు వచ్చిన వర్షపు నీటినీ దొంగచాటుగా వేరేవారి పొలాల్లోకి తోడటంతో నీరు నిలిచిపోయి నాట్లు వేసుకునే అవకాశం ఉండదని స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యం ధోరణి మొదటి నుంచి అలాగే ఉందని, మొగల్తూరు ఆనందా ఆక్వా ఫ్యాక్టరీలోనూ పైపులైన్లను దొంగచాటుగా గొంతేరు డ్రెయిన్‌లోకి కలిపివేసిన విషయాన్ని పోరాట కమిటీ సభ్యులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడూ ఫ్యాక్టరీ పూర్తి అయితే రోజుకు వాడే లక్షా 40 వేల లీటర్ల నీటిని పక్కన పొలాల్లోకిగానీ, దిగువన ఉన్న గొంతేరు డ్రెయిన్‌లోకిగానీ వదిలివేస్తారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మత్తు పదార్థాలను వీడదాం



తణుకులో డ్రగ్స్‌ను నిర్మూలించాలని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తణుకు టౌన్ : విద్యార్థులంతా మాదక ద్రవ్యాల పట్ల అవగాహన కలిగి వాటికి దూరంగా ఉండాలని తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీవీఎల్ నారాయణ చెప్పారు. సోమవారం కళాశాల విద్యార్థులు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడితే భవిష్యత్తు చిత్తవుతుందన్నారు. సాధ్యమైనంత వరకూ శీతల పానీయాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో విద్యార్థులంతా భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని, ర్యాగింగ్‌ను నిర్మూలిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు బీ రవికుమార్, ఎన్‌ఐడీ ప్రసాద్, ఏ. శేష గిరిరావు, ఏ చంద్రశేఖర్, సుధాకర్, డి ధనపతిరావు, మారుతీదేవి, చౌదరి, ఎంఎల్ వసంతకుమారి పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా ప్రారంభమై వెంకటేశ్వర సెంటర్, నరేంద్ర సెంటర్ వరకూ ఈర్యాలీ సాగింది.

పట్టాలపై ప్రాణాలు

- రైలు ప్రమాదాల్లో మరణాలు
- కానరాని కడచూపు
- అనాథలుగా తనువు చాలిస్తున్న వైనం
- అన్నీ తామై చేస్తున్న రైల్వే పోలీసులు
- జిల్లాలో పెరుగుతున్న సంఘటనలు



తణుకు సమీపంలో ఇటీవల రైలు పట్టాలపై మృతిచెందిన గుర్తు తెలియని యువకుడు (ఫైల్)

తణుకు: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి.. రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని మహిళ దుర్మరణం.. రైలు కింద పడి ప్రేమికుల ఆత్మహత్య... ఇలా రైలు పట్టాలపై నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదవశాత్తూ జరిగినా.. ఆత్మహత్యలకు పాల్పడినా.. చివరికి అనాథలుగానే తనువు చాలిస్తున్నారు. గుర్తుపట్టలేని స్థితిలో కొన్ని మృతదేహాలు ఉంటే.. రైల్వే శాఖలో నిబంధనల కారణంగా బంధువులు ఉన్నా మృతదేహాన్ని వదులుకుంటున్నవారు మరికొందరు. చివరికి రైల్వే పోలీసులే అన్నీ తామై కార్యక్రమాలు పూర్తి చేస్తున్నారు. ఇలా ఏటా వందల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతుండగా కేవలం పదుల సంఖ్యలో మాత్రమే మృతదేహాలు బంధువులకు చేరుతున్నాయి. జిల్లాలో వారంలో కనీసం ముగ్గురైనా రైలు పట్టాలపై ఏదో విధంగా తనువు చాలిస్తున్నారు.

మృతదేహాలు ఛిద్రం

ఎక్కడో పుట్టి.. మరెక్కడో పెరిగి.. చివరికి రైలు పట్టాలపై తనువు చాలిస్తున్నారు అభాగ్యులు. అందరూ ఉన్నా కనీసం కడచూపునకు నోచుకోలేక అనాథలుగానే మిగులుతున్నారు. కుటుంబ సభ్యుల చేతుల మీదుగా అంత్యక్రియలు జరగాల్సి ఉండగా రైల్వేశాఖ నిబంధనల కారణంగా కనీసం కడచూపునకు నోచుకోవడంలేక కాలగర్భంలో కలిసిపోతున్నారు. మరోవైపు రైలు పట్టాలపై మృతిచెందితే మృతదేహాన్ని చూసేందుకు సైతం ధైర్యం చాలదు. శరీర భాగాలు చెల్లాచెదురుగా పడటంతో ఎవరనేది గుర్తు పట్టలేని పరిస్థితి. ఇలా ఏటా జిల్లాలో రైలు పట్టాలపై మరణిస్తున్న గుర్తు తెలియని మృతదేహాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా, కుటుంబ తగాదాలు ఉన్నా ఆత్మహత్య చేసుకునేందుకు ప్రధానంగా రైలు పట్టాలనే ఎక్కువగా ఎంచుకుంటున్నారు. దీంతో ఇటీవలి కాలంలో రైలు పట్టాలపై ప్రమాదాలు పెరుగుతున్నాయి. మరోవైపు వేగంగా వెళుతున్న రైళ్లలో ప్రయాణిస్తున్న సమయంలో గుమ్మం దగ్గర ఉంటూ నిద్రమత్తులో ప్రమాదవశాత్తూ కింద పడి చనిపోతున్న సంఘటనలు జరుగుతున్నాయి.

ఏడాదిలో 180 మంది..

విజయవాడ జీఆర్‌పీఎఫ్ ప్రధాన కేంద్రంగా జిల్లాలోని ఆయా రైల్వేపోలీసు స్టేషన్లు పనిచేస్తుంటాయి. రాజమండ్రిలో డీఎస్పీ కార్యాలయం ఉండగా భీమవరంలో సీఐ కార్యాలయం ఉంది. ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం రైల్వే పోలీస్‌స్టేషన్లలో ఎస్సైలు విధులు నిర్వహిస్తున్నారు. తణుకు, నరసాపురం, నిడదవోలు రైల్వేస్టేషన్‌లు హెడ్‌కానిస్టేబుల్ పరిధిలో ఉంటాయి. ఏడాది కాలంగా జిల్లాలో వివిధ కారణాలతో 180 మంది మృత్యువాత పడగా వీరిలో గుర్తుతెలియని మృతదేహాలుగా 130 ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. వారం రోజుల వ్యవధిలో ఒక్క భీమవరం రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందారు.

అన్నీ తామై...

సాధారణంగా రైలు ప్రమాదం అనగానే మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో శరీర భాగాలు ముక్కలవుతాయి. ఈ పరిస్థితుల్లో రైల్వే పోలీసులు వీలైనంత వరకు అన్నివిధాలుగా మృతదేహం గుర్తించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మృతదేహం ఫొటోలు తీసి పత్రికలు ద్వారా ప్రచారం చేసి బంధువులకు సమాచారం వెళ్లేందుకు కృషి చేస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోతే చివరికి ఎవరూ బంధువులు రాకపోతే గుర్తు తెలియని వ్యక్తులుగా రికార్డుల్లో నమోదు చేస్తారు. రైలు ప్రమాదంలో మృతి చెందితే ఒక్కో మృతదేహాన్ని తరలించడానికి పోలీసులకు రూ.వెయ్యి చొప్పున రైల్వేశాఖ అందజేస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నగదు మృతదేహాన్ని తరలించడానికి, అంత్యక్రియలు నిర్వహించడానికి ఏమాత్రం సరిపోని పరిస్థితి. ఒక్కో సందర్భంలో కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాలను సైతం మార్చురీకు తరలించాల్సి ఉంటుంది. మృతదేహాన్ని నాలుగు రోజుల పాటు ప్రభుత్వాసుపత్రిలోనే ఉంచి వివరాలు లభ్యం కాకపోతే మున్సిపల్ సిబ్బంది సహకారంతో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో కొన్నిసార్లు రైల్వే పోలీసులే తమ జేబుల్లోని డబ్బులతో గుర్తుతెలియని మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తోంది.

అపోహలు వీడండి



రైలు కింద పడి ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితుల్లో మృతుడి కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేస్తారనే అపోహ ఉంది. రైల్వే ప్రమాదాల్లో కేసుల నమోదు కేవలం అపోహ మాత్రమే. ప్రమాదవశాత్తూ జరిగే సంఘటనల్లో ఎక్కువగా గుమ్మం వద్ద కూర్చుని నిద్రావస్థలో జారిపడి చనిపోతున్నారు. ఇలాంటి సందర్భాల్లో మృతుడి వద్ద ఆచూకీ లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహాలుగానే ఎక్కువ శాతం నమోదవుతున్నాయి. ఇలాంటి సంఘటనల్లో మృతదేహం తరలింపు, అంత్యక్రియలకు రైల్వేశాఖ రూ.వెయ్యి చెల్లిస్తోంది. ఈ నగదును పెంచాలని గతంలోనే ఉన్నతాధికారులకు నివేదించాం.

– ఏవీ ప్రసాదరావు, రైల్వే ఎస్సై, భీమవరం

తాడేపల్లిగూడెంలో చోరీ

తాడేపల్లిగూడెం రూరల్ : ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని యాగర్లపల్లి కొత్త ఫ్లైఓవర్ ప్రాంతంలో నివాసముంటున్న కోట శ్రీనివాస్ ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి, ఇంట్లోని సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ ఎస్సై ఎం.సూర్యభగవాన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బంగారపు పాపిడి బిళ్ల, రెండు జతల చెవి దిద్దులు, నాలుగు బం గారపు ముక్కలు, వెండి సామగ్రి, దీపారాధన కుందెలు చోరీకి గురైనట్టు శ్రీనివాస్ ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

టెన్త్ విద్యార్థిని మృతి



మౌనిక (ఫైల్)

జంగారెడ్డిగూడెం రూరల్: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఒక విద్యార్థిని సోమవారం మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన పోల్నాటి నాగేశ్వరరావు, పద్మ దంపతులు కుమార్తె పోల్నాటి మౌనిక (విన్ని) కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. కొన్ని రోజులుగా జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. పరిస్థితి విషమించడంతో మౌనిక మృతి చెందింది. విద్యార్థిని జంగారెడ్డిగూడెం త్రివేణి స్కూల్‌లో టెన్త్ చదువుతోంది. మౌనిక మృతితో పాఠశాలకు సెలవు ఇచ్చారు.

వాగు దాటుతూ మృత్యుఒడికి..



చాపర్ల గోవిందరాజు మృతదేహం

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెంలో బైనేరు వాగులో ప్రమాదవశాత్తు ఓ వృద్ధుడు మృతిచెందాడు, పంగిడిగూడెంకు చెందిన చాపర్ల గోవిందరాజు (50) గేదెలను రోజూ మేత కోసం తోలుకెళుతుంటాడు. సోమవారం మధ్యాహ్నం బైనేరు వాగు అవతలి ఒడ్డును ఉన్న గేదెలను తోలుకువద్దామని వాగులో దిగాడు. వాగు దాటుతుండగా నీటి ఉధృతికి కాలు జారీ పడిపోయాడు. గుండంలో చిక్కుకోవడంతో గల్లంతయ్యాడు. సమీప రైతులు గాలించగా మృతదేహం కనిపించింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అర్ధరాత్రి కుటుంబం తరలింపుతో ఆందోళన

కుక్కునూరు: కుక్కునూరు మండలానికి చెందిన మడెం సీతారాములు కుటుంబాన్ని తూర్పుగోదావరి జిల్లా కూనవరం పోలీసులు ఆదివారం అర్ధరాత్రి ఎవరికీ తెలియకుండా తీసుకువెళ్లడం సంచలనం రేపింది. వివరాలిలా ఉన్నాయి మండలంలో గోపరాజుగూడెం గ్రామానికి చెందిన మడెం సీతారాములు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె. ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో రెండు కార్లలో వచ్చిన వ్యక్తులు మడెం సీతారాములు, భార్య చిన్నక్క, కుమారుడు వెంకటేశ్వర్లును తీసుకువెళ్లారు. గ్రామస్తులు ఉదయం కుక్కునూరు పోలీసులను ఆశ్రయించారు. కాగా చిన్నక్క తమ్ముడు తూర్పుగోదావరి జిల్లా మొరుమూరులో ఉంటున్నాడు. అతడు 10 కాసుల బంగారాన్ని దొంగిలించి చిన్నక్క ఇంట్లో ఉంచినట్టు విచారణలో తేలడంతో అక్కడి పోలీసులు వచ్చి సీతారాముడి కుటుంబాన్ని తీసుకెళ్లారని గ్రామపెద్దలు తెలుసుకున్నారు. అయితే ఇక్కడి పోలీసులకు కనీస సమాచారం ఇవ్వకుండా తీసుకువెళ్లడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై తమకు ఎలాంటి సమాచారం లేదని, కూనవరం పోలీసులను సంప్రదించాలని కుక్కునూరు పోలీసులు తెలిపారు.

పురుగు కుట్టి ప్రాణాలు పోయాయి

పోలవరం: పురుగు కుట్టి ఏడేళ్ల బాలిక మృతి చెందిన ఘటన పోలవరం మండలం ఎల్ఎన్‌డీ పేటలో చోటుచేసుకుంది. కట్టవ రామలక్ష్మి(7) అనే బాలిక ఈనెల 29న పాఠశాల నుంచి ఇంటికి వచ్చి ఆరుబయట ఆడుకుంటుండగా పురుగు కుట్టింది. కుటుంబ సభ్యులు కొయ్యలగూడెం అక్కడినుంచి ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదివారం రాత్రి విజయవాడ తరలిస్తుండగా మృతి చెం ది నట్టు ఏఎస్సై బి.వాయునందనరావు తెలిపారు.

భార్యపై దాడి చేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

తాళ్లపూడి: భార్యపై దాడి చేసి హతమార్చేందుకు యత్నించిన కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష పడినట్టు తాళ్లపూడి ఎస్సై ఆశోక్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. వేగేశ్వరపురం గ్రామానికి చెందిన ఉమ్మిడిశెట్టి కృష్ణ అనే వ్యక్తి భార్య పోశమ్మపై అక్టోబర్ 2016న దాడి చేసి చంపేందుకు యత్నించాడు. పోశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా న్యాయస్థానం సోమవారం ఐదేళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించింది.

విద్యుదాఘాతం బలిగొంది



నిడదవోలు మండలం కోరుమామిడిలో రాజు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, పరిశీలిస్తున్న ఎస్సై నరేంద్ర

రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి



కొల్లి రాంబాబు మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్ : విద్యుదాఘాతంతో రెండు వేర్వేరుచోట్ల ఇద్దరు మృతిచెందారు. తాడేపల్లిగూడెంలో తాపీమేస్త్రి, నిడదవోలు మండలం కోరుమామిడితో వ్యవసాయ కూలీ దుర్మరణం పాలయ్యారు. బిల్డింగ్ పనిచేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి చికిత్స పొందుతూ తాపీ మేస్త్రి మృతి చెందిన ఘటన తాడేపల్లిగూడెంలోని సుబ్బారావుపేటలో సోమవారం చోటుచేసుకుంది. కొల్లి రాంబాబు (రాము) (25) అనే వ్యక్తి మృతిచెందాడు. తీవ్ర విద్యుదాఘాతానికి గురికావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాము పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ మామిడితోటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు.


కోరుమామిడిలో వ్యవసాయ కూలీ

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి శివారు అమ్మేపల్లి ఆయిల్‌పామ్ తోటలో కరెంట్ షాక్‌తో వ్యవసాయ కూలీ మృతిచెందినట్టు సమిశ్రగూడెం ఎస్సై కె.నరేంద్ర సోమవారం తెలిపారు. కోరుమామిడి గ్రామానికి చెందిన కుండా రాజు (36) కూలీ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆయిల్ పామ్ తోటలో చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్తు తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నరేంద్ర చెప్పారు.

భవిష్యం

మేషం: పనుల్లో అవాంతరాలు. వృథా ఖర్చులు. బంధువిరోధాలు. శ్రమాధిక్యం. అనారోగ్యం. వృత్తి, వ్యాపారాలు గందరగోళంగా ఉంటాయి.

వృషభం: పలుకుబడి పెరుగుతుంది. ఆసక్తికర సమాచారం. విందువినోదాలు. యత్నకార్యసిద్ధి. వస్తు, వస్త్రలాభాలు. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి.



మిథునం: మిత్రులతో సఖ్యత. విందువినోదాలు. ఆలయాలు సందర్శిస్తారు. పనులు సకాలంలో పూర్తి. సంఘంలో ఆదరణ. వృత్తి, వ్యాపారాలలో అనుకూల పరిస్థితి.

కర్కాటకం: శ్రమ పెరుగుతుంది. పనుల్లో ఆటంకాలు. అనుకోని ఖర్చులు. దూరప్రయాణాలు. ఇంటాబయటా చికాకులు. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

సింహం: మిత్రులతో విభేదాలు. ఆరోగ్య భంగం. పనులు వాయిదా వేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి.

కన్య: దూరపు బంధువుల కలయిక. విందువినోదాలు. కార్యసిద్ధి. పరిచయాలు పెరుగుతాయి. ఆస్తి లాభాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో పురోగతి.

తుల: రుణాలు చేస్తారు. ప్రయాణాలు వాయిదా వేస్తారు. బంధువర్గంతో విభేదాలు. ఆలోచనలు కలసిరావు. దైవదర్శనాలు. వృత్తి, వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి.

వృశ్చికం: కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడుపుతారు. వాహనసౌఖ్యం. ఉత్సాహంగా పనులు పూర్తి చేస్తారు. ఆధ్యాత్మిక చింతన. వ్యాపార, ఉద్యోగాలలో ప్రోత్సాహం.

ధనుస్సు: మిత్రులతో అకారణంగా విరోధాలు. ఆలోచనలు నిలకడగా ఉండవు. బాధ్యతలు పెరుగుతాయి. అనారోగ్యం. వృత్తి, వ్యాపారాలలో చికాకులు.

మకరం: పరిచయాలు పెరుగుతాయి. ఆశయాలు నెరవేరతాయి. ఆకస్మిక ధనలాభం. బంధువుల తోడ్పాటు లభిస్తుంది. పనులు సకాలంలో పూర్తి. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి.

కుంభం: ఉద్యోగయోగం. కీలక నిర్ణయాలు. వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. దైవదర్శనాలు. రుణఒత్తిడులు తొలగుతాయి. వృత్తి, వ్యాపారాలలో నూతనోత్సాహం.

మీనం: రుణయత్నాలు. ఆకస్మిక ప్రయాణాలు. బంధువర్గంతో తగాదాలు. అనారోగ్యం. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి.

– సింహంభట్ల సుబ్బారావు

అరచేతిలో విద్యుత్ సమాచారం

• ఉర్జామిత్ర యాప్‌తో విద్యుత్ సేవలు • తెలుగులోనూ విద్యుత్తు సరఫరా సమాచారం

నిడమర్రు :

సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని ప్రతీ ప్రభుత్వ శాఖలో ఆయా శాఖల పనితీరుని మెరుగుపరుచుకునేందుకు యాప్‌ల రూపకల్పన కొనసాగుతుంది. ఈ నేపథ్యంలోనే దేశంలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సేవలు అందించేందుకు భారత ఇంధన వనరుల మంత్రిత్వశాఖ చొరవతో 'ఉర్జామిత్ర యాప్'(విద్యుత్తు మిత్రుడు) విద్యుత్ శాఖ అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఈ యాప్ ద్వారా విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడినపుడు దానికి సంబంధించిన సమాచారం సత్వరం వినియోగదారులకు తెలిపేందుకు ఈ ఉర్జా మిత్ర యాప్ ఉపయోగపడుతుంది. విద్యుత్ అంతరాయం రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి విద్యుత్ అంతరాయ వేళలు ముందే నిర్ణయించిన షెడ్యూల్, రెండు ఆకస్మిక అంతరాయం గా ఉంటాయి. ఈ రెండు రకాల సమాచారం ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న వినియోగదారుడికి ముందే అధికారులు తెలియజేస్తారు.



అంతరాయ సమాచారం ఇలా...

విద్యుత్ అంతరాయ సమాచారం సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్)/ఈ–మెయిల్/పుష్ నోటిఫికేషన్ ద్వారా విద్యుత్ సర్వీస్ బట్టి వినియోగదారునికి అంతరాయ వేళలతో సహా పూర్తి వివరాలు అధికారులు అందిస్తారు. ఈ సమాచారం తెలుగు/ఆంగ్లం తదితర భాషల్లో ఉంటుంది. విద్యుత్తు వినియోగదారులు గతంలో సర్వీసుకు అనుసంధానం చేసిన విద్యుత్తు సెల్ నంబర్లకు చేరుతుంది. లైన్ల మరమ్మతులు, స్తంభాలు ఏర్పాటుచేయడం వంటి సమయాన్ని ముందుగా అధికారులు అంచనా వేసి తగిన సమయాన్ని నిర్ణయించి షెడ్యూల్ ప్రకారం సమాచారం పంపిస్తారు. రెండోది చెట్లు విరిగి తీగలపై పడటం, ఇన్సులేటర్ పగిలిపోవడం, విద్యుత్ సరఫరా చేసే ఉపకేంద్రాలు డెడ్ అవ్వడం వంటి ఆకస్మాత్తుగా జరిగే సందర్భంలో అంతరాయ సమయం అంచనా వేసుకుని ఇంత సమయం పడుతుందని తెలియజేస్తారు. ఒకవేళ ముందు పంపిన సమాచారం ప్రకారం అంతరాయ సమయం పొడిగిస్తున్నట్టయితే తిరిగి ఆ సమాచారం తెలియజేస్తారని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండిలా..

గూగుల్ ప్లే స్టోర్‌లో ఉర్జామిత్ర అని ఆంగ్లంలో టైప్‌చేసి డౌన్‌లోడ్ చేసుకుని మీ మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అనంతరం కనిపించే ముఖ చిత్రంలో కనిపించే ఆప్షన్స్ ప్రకారం తెలుగు భాషను ఎంచుకున్నాక అక్కడ మీ విద్యుత్తు ఖాతా నమోదు, మీ ప్రాంతంలో విద్యుత్తు అంతరాయం, ఇంటిమేట్ లభ్యత సమాచారం, డాష్ బోర్డుల కాలంలు కనిపిస్తాయి. అక్కడ ఖాతా నమోదు కాలం క్లిక్ చేస్తే మరో కాలం కనిపిస్తుంది. అక్కడ మీ ప్రాంతంలో విద్యుత్ అంతరాయం చేత ఈవెంట్ ఎస్ఎంఎస్/ఈ–మెయిల్/పుష్ నోటిఫికేషన్ పొందడానికి ఖాతా నమోదు చేయండి అనే కాలంలో రాష్ట్రం, డిస్కంలో ఏపీఈపీడీసీఎల్ అప్షన్‌ను తెలిసినట్టయితే పవర్ ఫీడర్‌ను ఎంచుకోవచ్చు. అక్కడే సూచించిన కాలంలో వినియోగదారుడి విద్యుత్ ఖాతా సంఖ్య, మీ మొబైల్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ నమోదు చేయాలి. దీంతో ఈ యాప్ ద్వారా మీ విద్యుత్ సర్వీస్ కనెక్షన్‌కు సంబంధించి సరఫరాలో అంతరాయం ఏర్పడితే మీకు సమాచారం తెలుపుతారు. ఈ యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ సాఫ్ట్‌వేర్ కలిగిన స్మార్ట్ ఫోన్లలో మాత్రమే ఈ యాప్ ఇన్‌స్టాల్ అవుతుంది.

చేపలు, రొయ్యల ధరలు

భీమవరంలో..

చేపలు		వనామీ రొయ్యలు	
పండుగొప్ప	రూ.450	30 కౌంటు	రూ.400
కొర్రమేను	రూ.400	40 కౌంటు	రూ.350
శీలావతి	రూ.109	50 కౌంటు	రూ.300
బొచ్చె	రూ.110	60 కౌంటు	రూ.270
మోసు	రూ.80	70 కౌంటు	రూ.260
ఫంగస్	రూ.60	80 కౌంటు	రూ.240
పీతలు	రూ.700	90 కౌంటు	రూ.230
కట్ల	రూ.54.50	100 కౌంటు	రూ.220

కూరగాయల ధరలు

తాడేపల్లిగూడెం మార్కెట్

(కిలోకు రూపాయల్లో)

ఉల్లి	20	బీన్స్	80
టమాట	60	పచ్చిమిర్చి	40
వంకాయలు	60	బంగాళ దుంపలు	20
బీర	40	అల్లం	60
దొండ	30	చిలకడదుంపలు	40
బెండ	40	పెండలం	40
క్యాప్సికమ్	80	కంద	40
క్యారెట్	40	ఆనపకాయ	
కాకర	50	ఒక్కటి	15
క్యాబేజీ	30	అరటి కాయ	
చిక్కుడు	100	ఒక్కటి	8
గోరుచిక్కుడు	30	మునగ కాడ	10

ఏలూరు వాతావరణం


గరిష్టం : 34.6 | కనిష్టం : 25.2

నేడు : చిరు జల్లులు కురిసే అవకాశం. ఉదయం వేడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుంది. గరిష్టం 35 డి.సె. కనిష్టం 26 డి.సె.

రేపు : వేడిగా ఉంటుంది. ఉదయం ఆహ్లాదం. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వేడిగా ఉంటుంది. గరిష్టం 34 డి.సె. కనిష్టం 26 డి.సె.

గురువారం : ఉదయం వేడిగా ఉండే అవకాశం ఉంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రి కూడా వేడిగా ఉండవచ్చు. గరిష్టం 34 డి.సె. కనిష్టం 26 డి.సె.

తిరుమల సమాచారం



తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనం కోసం వేచి ఉండే భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 23 కంపార్టుమెంట్లు నిండిపోయాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు :

ఉచిత గదులు – ఖాళీ లేవు
రూ.50 గదులు – ఖాళీ లేవు
రూ.100 గదులు – ఖాళీ లేవు
రూ.500 గదులు – ఖాళీ లేవు

ఆర్జిత సేవల వివరాలు:

సహస్ర దీపాలంకరణ సేవ – ఖాళీ లేవు
వసంతోత్సవం – ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం – ఖాళీ లేవు

మంగళవారం ప్రత్యేక సేవ : అష్టదళపాదపద్మారాధన

రైల్వే సమాచారం

భీమవరం

భీమవరం జంక్షన్ నుంచి విజయవాడకు

57218	ప్యాసింజర్	మాచర్ల–భీమవరం	డైలీ	14.40	----
77204	ప్యాసింజర్	గుడివాడ–నరసాపురం	డైలీ	17.50	17.55
77232	ప్యాసింజర్	భీమవరం – గుడివాడ	డైలీ	----	05.25
57282	ప్యాసింజర్	నరసాపురం – గుంటూరు	డైలీ	07.05	07.10
77203	ప్యాసింజర్	నరసాపురం – గుడివాడ	డైలీ	08.50	08.55
57298	ప్యాసింజర్	నరసాపురం – గుంటూరు	డైలీ	13.40	13.45
57280	ప్యాసింజర్	భీమవరం – గుడివాడ	డైలీ	----	15.40
77205	ప్యాసింజర్	నరసాపురం – భీమవరం	డైలీ	16.50	16.55
17404	ఎక్స్‌ప్రెస్	నరసాపురం – తిరుపతి	డైలీ	18.15	18.20
17255	ఎక్స్‌ప్రెస్	నరసాపురం – హైదరాబాద్	డైలీ	19.45	19.50
77206	ప్యాసింజర్	భీమవరం – విజయవాడ	డైలీ	----	21.15

భీమవరం జంక్షన్ నుంచి నిడదవోలు వైపునకు

57264	ప్యాసింజర్	నరసాపురం – విశాఖపట్నం	డైలీ	00.10	00.40
57262	ప్యాసింజర్	నిడదవోలు – భీమవరం	డైలీ	08.55	----
77238	ప్యాసింజర్	రాజమండ్రి– భీమవరం	డైలీ	14.35	----
77240	ప్యాసింజర్	నిడదవోలు – భీమవరం	డైలీ	19.50	----
57279	ప్యాసింజర్	గుడివాడ –నరసాపురం	డైలీ	20.45	20.50
57281	ప్యాసింజర్	గుంటూరు – నరసాపురం	డైలీ	21.32	21.35
77241	ప్యాసింజర్	నిడదవోలు – భీమవరం	డైలీ	23.15	----
57229	ప్యాసింజర్	మచిలీపట్నం–నరసాపురం–విశాఖపట్నం	డైలీ	00.15	00.35
57263	ప్యాసింజర్	నరసాపురం – నిడదవోలు	డైలీ	05.10	05.20
77237	ప్యాసింజర్	భీమవరం – రాజమండ్రి	డైలీ	----	07.30
17241	ఎక్స్‌ప్రెస్	నరసాపురం – విశాఖపట్నం	డైలీ	10.55	11.00
57259	ప్యాసింజర్	భీమవరం – రాజమండ్రి	డైలీ	----	14.45
77239	ప్యాసింజర్	భీమవరం– నిడదవోలు	డైలీ	----	15.50
77243	ప్యాసింజర్	భీమవరం టౌన్–నిడదవోలు	డైలీ	17.25	17.55
77241	ప్యాసింజర్	నరసాపురం – రాజమండ్రి	డైలీ	20.45	20.50

భీమవరం జంక్షన్ నుంచి నరసాపురం వైపునకు

57230	ప్యాసింజర్	విశాఖ–నరసాపురం–మచిలీపట్నం	డైలీ	03.05	03.50
57265	ప్యాసింజర్	విశాఖపట్నం – నరసాపురం	డైలీ	----	03.50
17403	ఎక్స్‌ప్రెస్	తిరుపతి – నరసాపురం	డైలీ	05.11	05.12
77202	ప్యాసింజర్	గుడివాడ –నరసాపురం	డైలీ	06.15	06.20
77242	ప్యాసింజర్	రాజమండ్రి –భీమవరం	డైలీ	07.10	----
17256	ఎక్స్‌ప్రెస్	హైదరాబాద్–నరసాపురం	డైలీ	07.05	07.10
57260	ప్యాసింజర్	రాజమండ్రి– నరసాపురం	డైలీ	10.25	10.30
77231	ప్యాసింజర్	విజయవాడ – భీమవరం	డైలీ	11.00	----
77233	ప్యాసింజర్	భీమవరం–నరసాపురం	డైలీ	----	11.20
17242	ఎక్స్‌ప్రెస్	విశాఖపట్నం –నరసాపురం	డైలీ	13.38	13.41
77204	ప్యాసింజర్	గుడివాడ –నరసాపురం	డైలీ	17.50	15.55

బుల్లితెర

W

SAKSHI TV


ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.45 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్‌స్టోరీ
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 స్క్రీన్‌ప్లే
మ.12.30 న్యూస్ ఫీచర్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.30 క్రైమ్ స్టోరీ
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజైన్ స్టోరీ

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 పృథ్వీనారాయణ
ఉ.09.30 కె.డి. నం.1
మ.12.00 శ్రీరామచంద్రులు
మ.03.00 ఆయుధం
సా.06.00 ఘరానా మొగుడు
రా.09.00 ఆటోనగర్ సూర్య




స్టార్ గోల్డ్
ఉ.10.20 సనమ్ రే
మ.01.00 బాడీగార్డ్
మ.03.50 బడేమియా ఛోటేమియా
సా.06.55 మార్ మిటేంగే
రా.09.50 బజ్‌రంగీ భాయ్‌జాన్




హెచ్‌బీవో
మ.11.40 గ్రీస్
మ.01.39 కుంగ్‌ఫూ పాండా
మ.03.15 షావోలిన్ సాకర్
సా.05.00 జాస్ 2
రా.09.00 బ్యాట్‌మ్యాన్ వర్సస్ సూపర్‌మ్యాన్



స్టార్ మూవీస్
మ.01.06 ద లయన్ కింగ్
మ.02.53 ద ఇన్‌క్రెడిబుల్స్
రా.07.08 బాబిలోన్ ఎ.డి.
రా.09.00 బేబీస్ డేఔట్
రా.11.04 కమెండో



మా మూవీస్
ఉ.09.00 చంద్రలేఖ
మ.12.00 ధైర్యం
మ.03.00 కేరింత
సా.06.00 సూర్యవర్సస్ సూర్య
రా.09.00 143 ఐ మిస్ యు



జీ సినిమా
మ.12.10 హమారా దిల్ ఆప్‌కే పాస్ హై
మ.03.12 యమ్‌లోక్
సా.06.00 మైదాన్ ఇ జంగ్
రా.09.00 ఎన్‌కౌంటర్ శంకర్

బులియన్ నరసాపురం

24 క్యారెట్ల బంగారం
10 గ్రాముల ధర రూ.29,160

22 క్యారెట్ల బంగారం
10 గ్రాముల ధర రూ.27,620

వెండి కిలో ధర రూ.38,700

కొబ్బరి ధరలు పాలకొల్లు



పాత కాయ
(వెయ్యింటికి) రూ. 9,500

కొత్త కాయ
(వెయ్యింటికి) రూ. 8,500

రిపోర్టర్ల ఫోన్ నంబర్లు : ఆచంట - జేఎం వెంకటేశ్వరరావు, 97053 46806, పెనుగొండ - జి. శ్రీనివాసరావు, 97054 01918, పెనుమంట్ర - ఎస్. జయ రామకృష్ణ, 99081 63555



యథేచ్ఛగా మద్యం బెల్టులు

- క్వార్టర్ బాటిల్‌కు రూ.25 నుంచి రూ.35 వరకూ ఎక్కువకు అమ్మకాలు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఆచంట :

వల్లూరు పసరిసర గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జోరుగా సాగిపోతున్నాయి. క్వార్టరు బాటిల్‌కు రూ.25 నుంచి రూ.35 వరకూ ఎక్కువకు అమ్ముతూ బెల్టు షాపు నిర్వాహకులు జేబులు నింపుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. నెల రోజుల నుంచి వల్లూరు, భీమలాపురం, కరుగోరుమిల్లి, కందరవల్లి గ్రామాల్లో ఇదే పరిస్థితి. వల్లూరులో మద్యం దుకాణం ఏర్పాటులో జరుగుతున్న జాప్యం బెల్టుషాపు నిర్వాహకులకు వరంగా మారింది. గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటుకు సిండికేట్లు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఊరి చివర షాపు కూడా సిద్ధం చేశారు. అయితే గ్రామస్తుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం కావడంతో షాపు ఏర్పాటు కాలేదు. నెల నుంచి గ్రామంలో ఇదే పరిస్థితి. దీంతో మంచి తరుణంగా భావించిన వల్లూరు పరిసర గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వాహకులు అక్రమ మద్యం అమ్మకాలు మూడుపువ్వులు ఆరు కాయలుగా సాగిస్తున్నారు. మండలంలో వల్లూరు మేజర్ గ్రామం. పరిసర గ్రామాల నుంచి వల్లూరు వచ్చి మందుబాబులు మద్యం కొనుగోలు చేసేవారు. నెల రోజులుగా షాపు లేకపోవడంతో వల్లూరు పరిసర గ్రామాలకు చెందిన మందుబాబులు మద్యం కొనుగోలు చేయాలంటే మండల కేంద్రమైన ఆచంటకాని, పోడూరు మండలం రావిపాడు గాని వెళ్లాల్సి ఉంది. ఆమడ దూరంలోని షాపు వద్దకు వెళ్లలేక మందుబాబులు బెల్టు నిర్వాహకులు అడిగినంత ఇచ్చుకోక తప్పడం లేదు. ఒక పక్క ప్రభుత్వం బెల్టుషాపులపై ఉక్కుపాదం అని ప్రకటిస్తున్నా బెల్టుల్లో అమ్మకాలు మాత్రం జోరుగా సాగిపోతున్నాయి. ఇళ్లల్లోనూ, కిళ్లీ షాపుల్లోనూ మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. దాడులకు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అమ్మకం జరిగే ప్రదేశంలో పెద్ద మొత్తంలో బాటిళ్లు ఉంచకుండా రహస్య ప్రాంతాల్లో ఉంచి అతి కొద్దిమొత్తంలో బాటిళ్లు తమ వద్ద ఉంచుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. కొందరైతే జేబుల నిండుగా బాటిళ్లు పెట్టుకుని అమ్మకాలు సాగిస్తూ అధికారుల కళ్లుగప్పుతున్నారు.


వల్లూరులో గ్రామస్తుల ఆందోళనతో తెరచుకోని మద్యం దుకాణం

పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేయించండి

పెనుగొండ : మండలంలోని 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు వయసు పిల్లలందరికీ తప్పనిసరిగా ఎమ్మార్ వ్యాక్సిన్ వేయించాలని సిద్ధాంతం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌమ్య కోరారు. ఎమ్మార్ వ్యాక్సిన్‌పై అవగాహన సదస్సు సోమవారం సిద్ధాంతం పీహెచ్‌సీలో నిర్వహించారు. ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని మంగళవారం పెనుగొండ భాష్యం పాఠశాలలో రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి పితాని సత్యనారాయణ ప్రారంభిస్తారని చెప్పారు. వ్యాక్సిన్‌ను ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో, పాఠశాలల్లో వేస్తారని వివరించారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రమణ, హెల్త్ సూపర్ వైజర్లు కె.సురేష్, అడ్డాల ఉమామహేశ్వరరావు, కె.వెంకటలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వాసవి ఆలయ హుండీ ఆదాయం రూ.2.49 లక్షలు

పెనుగొండ : నగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయానికి హుండీ ద్వారా రూ.2,48,604 ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు. 75 రోజలకు గాను సోమవారం హుండీ లెక్కించినట్టు వివరించారు. నగదుతో పాటు 20.629 గ్రాముల బంగారం, 205.377 గ్రాముల వెండి వచ్చాయని వివరించారు. అన్నదాన హుండీ ద్వారా రూ.9,951 ఆదాయం వచ్చినట్టు చెప్పారు. హుండీ లెక్కింపులో దేవాదాయ శాఖ తణుకు డివిజన్ తనఖీదారు రేపాక బాలాజీ పర్యవేక్షణలో ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ నూలి చిన గణేష్, పి.సాయిప్రసాద్, ఆర్.సురేష్‌కుమార్, కోట వెంకటసుబ్రహ్మణ్యం, కొండవీటి శ్యామసుందరశాస్త్రి, కోటగిరి ధరశర్మ, అనిపెద్ది సాయికృష్ణశర్మ, నాగెళ్ల వెంకటేశ్, సన్నిధి సురేష్, ఆలయ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.


పెనుగొండ వాసవి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

కవిటంలో నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

పోడూరు : కవిటంలో అంతియోక్ చర్చి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు యూత్ పాస్టర్ జి.పాల్‌సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొల్లుకు చెందిన రాజవల్లి రాధారమణ్ లయన్స్ కంటి ఆసుపత్రి సిబ్బంది శిబిరంలో పాల్గొన్నవారికి బ్లడ్ సుగర్, కంటి శుక్లాలు, కంటిచూపు, కంటి అద్దాల పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి అంతియోక్ చర్చ్ ఆధ్వర్యంలో ఉచితంగా వాటిని నిర్వహిస్తారన్నారు. కవిటంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని వినియోగిచుకోవాలని చర్చి డైరెక్టర్ జీవీవీ సుబ్బారావు, పాస్టర్ జి.విశ్వం కోరారు.

ముద్రగడ పాదయాత్రతో చట్టం గుర్తొచ్చిందా?

పోడూరు :

ఎన్నికలకు ముందు ఓట్ల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పాదయాత్ర చేశారనీ, అప్పుడు లేని చట్టం ఇప్పుడు ముద్రగడ పాదయాత్ర చేస్తుంటే గుర్తుకు వచ్చిందా? అని పెనుమదం గ్రామానికి చెందిన కాపులు ప్రశ్నించారు. కాపునేత ముద్రగడ పద్మనాభంకు మద్దతుగా సోమవారం రాత్రి పెనుమదంలో కాపు యూత్, ముద్రగడ యూత్ ఆధ్వర్యంలో కాపులు కొవ్వొత్తులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాపు యూత్ నాయకులు మాట్లాడుతూ రేపటి దయ భవిష్యత్తు కోసం పోరాడుతున్న ముద్రగడను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ముద్రగడ నేతృత్వంలో కాపులు చేస్తున్న పోరాటాన్ని అణచివేయాలని చూస్తే రానున్న రోజుల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కాపులకు ఇచ్చిన హామీ ప్రకారం కాపులను రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముచ్చర్ల మహేష్, చెన్నంశెట్టి సురేంద్ర, బండారు రాఖి, బండి కార్తీక్, మంగిన సురేష్, ఇనుకొండ నాగరాజు ర్యాలీలో పాల్గొన్నారు.


ముద్రగడకు మద్దతుగా పెనుమదంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న కాపు యూత్, ముద్రగడ యూత్ సభ్యులు

ప్రమాద నివారణకు చర్యలు చేపట్టండి

పెనుగొండ : వడలి–పిట్టల వేమవరం రహదారిలో తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వైస్సార్ సీపీ వడలి గ్రామ శాఖ అధ్యక్షుడు మేకా సింహాద్రి అప్పన్న విజ్ఞప్తి చేశారు. రహదారి మలుపు ప్రమాదకరంగా మారిందన్నారు. గుబురు పొదలు ఉండడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ప్రాణాలు సైతం కోల్పోతున్నారన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా రక్షణ చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆరోగ్య ఉపకేంద్రం పనులు ప్రారంభించాలి

పాలకొల్లు అర్బన్ : కాపవరంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని గ్రామ సర్పంచ్ అంగర అనిత సోమవారం మీ కోసంలో అర్జీ అందజేశారు. ఏడాదికాలంగా పనులు నిలిపివేయటంతో అసంపూర్తి భవనం చుట్టూ తుప్పలు పెరిగిపోతున్నాయని, ప్రజలు సరైన ఆరోగ్య సేవలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. తహసీల్దార్ దాసి రాజు, ఎంపీడీవో అడబాల వెంకట అప్పారావు, ఈవోపీఆర్డీ గుబ్బల మల్లికార్జునరావు, ఏవో ఇడవలూరి సుజాత, ఏఈలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఒకే టీకాతో రెండు రోగాల నుంచి రక్షణ

పెనుమంట్ర : తట్టు, రుబేరా వ్యాధుల పట్ల ప్రజలు పూర్తి అప్రమత్తంగా ఉండాలని పెనుమంట్ర పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సుబ్బారెడ్డి కోరారు. ఈ వ్యాధుల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సోమవారం పెనుమంట్రలో ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ రెండు వ్యాధుల నివారణకు ఒకే టీకా అందుబాటులోకి రావడం అదృష్టమని ఈసందర్భంగా సుబ్బారెడ్డి అన్నారు. డాక్టర్ వీరవల్లి లక్ష్మి పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయండి

పెనుమంట్ర : మార్టేరు–భీమవరం ప్రధాన రహదారిపై పొలమూరు గ్రామ కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో అనేక సార్లు అధికారులకు మొత్తుకున్నా ఫలితం లేకపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాల రద్దీ, అతివేగం కారణంగా ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం పెనుమంట్రలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో గ్రామస్తులు ఫిర్యాదు అందించారు. మీ కోసంకు మరో 8 అర్జీలు అందాయి.

కాపు రుణాల మంజూరుపై ఆరోపణలు

పెనుమంట్ర : కాపు రుణాల మంజూరుపై పలు ఆరోపణలు కాక పుట్టిస్తున్నాయి. పెనుమంట్ర మండలంలో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్నాళ్లుగా ఈవిషయంపై గ్రామాల్లో చర్చ జరుగుతుండగా సోమవారం మీ కోసం కార్యక్రమంలో కొందరు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాపులకు రుణాలకు పొలమూరులో 170 మంది దరఖాస్తులు అందించారు. అధికారుల పరిశీలన తరువాత వారిలో 28 మందిని అర్హులుగా గుర్తించారు. అర్హులుగా గుర్తించిన వారిలోను ఒక్కరికి మాత్రమే రుణం అందించారు. అర్హుల జాబితాలో మిగిలిన వారికి ప్రజా ప్రతినిధులు, అధికారులు న్యాయం చేయడంలేదని ఉప సర్పంచి మేనీడి సత్యనారాయణ విమర్శించారు. అర్హులంతా ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం నుంచి పైసా సహాయం అందలేదని చెప్పారు. ఈ విషయమై జన్మభూమి సభలో నిలదీసినా పేద కాపులకు న్యాయం జరగలేదని అన్నారు. గ్రామంలో ఒకే ఒక్కరికి రుణం మంజూరు చేయగా, సదరు వ్యక్తి ఈ రుణం పొందడానికి పూర్తిగా అనర్హుడని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు గుర్తించిన అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలని కోరుతూ మీ కోసంలో ఫిర్యాదు అందజేశామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ చివరి అవకాశం : కాకినాడ మరియు ఏలూరు నందు స్పెషల్ డి.ఎడ్ కోర్స్ అడ్మిషన్స్ కొరకు సంప్ర : 9440119828, 9948600642, 9491220349 [P-872778]

■ BSC (Agriculture)కి అడ్మిషన్లు జరుగుచున్నవి. అడ్మిషన్లు ఉన్న PRO / Consultants సంప్రదించండి : Sri Balaji AG BSC Nellore. Call : 81430 01008, 81430 02008. [N-3609]

■ ఎయిర్‌లైన్ ఉద్యోగ శిక్షణ ఇవ్వబడును. వ: 18–23, అ: +2/ డిగ్రీ పాస్/ ఫె యిల్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ మరియు గుడ్ లుకింగ్ వారు DSNR, HYD సంప్ర: 7207209061. [H-693129]

■ ONE SITTING/YEAR WISE 10th, Inter, డిగ్రీ/PG, BA, B.Com, B.Sc, MA, M.Com, M.Sc., MBA, Diploma, B.Tech Sv. Rjy. 78424 24824, 8499994456. [R-08]



PLOT FOR SALE

■ విజయవాడ బెంజి సర్కిల్‌కి కేవలం 6 కి.మీ. దూరంలో అవనిగడ్డ బైపాస్‌రోడ్, ఇన్నర్ రింగ్‌రోడ్ దగ్గర ప్లాట్లు. చ॥గ॥ రూ. 4900/–, 8200/– మీ సొంతం. ✆ 96403 08635 [B-431]

FLAT FOR SALE

■ విజయవాడ, బెంజిసర్కిల్‌కి అతి దగ్గరలో 2 B/R, ఫ్లాట్స్ అతి తక్కువ ధరలో లిఫ్ట్, కారు పార్కింగ్, బ్యాంక్ లోను, అన్ని సౌకర్యాలతో అమ్మకం. సంప్ర. ✆ 99486 43388 [B-245]



BUSINESS OFFER

■ ప॥గో॥ జిల్లాలో ప్రముఖ బ్రాండ్ ఇంజెన్ ఆయిల్ కొరకు ఏరియాలవారిగా డీలర్స్ కావలెను.సంప్రదించండి. సుజాత ఏజెన్సీస్. 8985449896/9063637999 [C-617036]

■ నిరుద్యోగులకు, గృహిణులకు, పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్ జాబ్ చేస్తూ ఇంటి వద్దే ఉంటూ అదనపు ఆదాయం సంపాదించుకోవచ్చు. సంప్ర:9703598476 [C-617038]

GOLD FINANCE

■ బ్యాంకులు / సంస్థల నుండి తాకట్టు పెట్టిన మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. సంప్రదించండి : ✆ 81421 30517 [B-6182]

■ బ్యాంకులు / సంస్థల నుండి తాకట్టు పెట్టిన మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. సంప్రదించండి : ✆ 95739 44799 [B-0043]

■ బ్యాంకులు / సంస్థల నుండి తాకట్టు పెట్టిన మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. సంప్రదించండి : ✆ 96039 41444 [B-0045]

■ బ్యాంకులు / సంస్థల నుండి తాకట్టు పెట్టిన మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట ధరకు కొనబడును. సంప్రదించండి. ✆ 70366 81069. [B-609451]

ASTROLOGY

■ టి.పి.గూడెంలో బొటనవేలి ముద్ర ఆధారంతో మీ భవిష్యత్ చెప్పబడుతుంది. నాడీ ఆస్ట్రాలజర్స్. కె.రాజేష్‌స్వామి & సిలింబు స్వామి కాంటాక్ట్ : 88973 05667, 94439 85969. [P-2275]

■ కేరళ మాంత్రిక జ్యోతిష్యం. మీ ఏరకమైన సమస్యయైనా 2 గం॥లలో పరిష్కారం. స్త్రీ/పు వశీకరణ 100% గ్యారంటీ. పండిత్ వామన్ భట్. Ph: 72888 01008 [V- 596878]

WEIGHT LOSS

■ 5 వారాలలో డైట్ లేకుండా 8–10 KG ల బరువు, చేతులు, తొడలు, పొట్ట సైజు, మలబద్ధకం, గ్యాస్ట్రిక్ ప్రాబ్లం, మోకాళ్ళ నొప్పులు తగ్గుతాయి. ఫోన్: 7207923767. [HA-14109]

వధువు కావలెను

■ CNB, 45Y, 5'2" బిజినెస్, వెల్ సెటిల్డ్, ఒంగోలు నివాసము, లేటుమ్యారేజ్ వరునకు, 35to45 సం॥ వయసు మానవవిలువలకు ప్రాధాన్యతనిచ్చే (1వ, 2వ లేదా విడో)అయినా వధువు కావలెను. సెల్ : ✆ 99085 11522, వాట్సప్ నెం. 99497 88100 [O-603199]



■ ఏలూరు, అశోకనగర్‌లో ఉన్న ప్రముఖ స్కూలులో పనిచేయుటకు ఇద్దరు ఆయాలు (స్త్రీ) కావలెను. వెంటనే సంప్రదించండి : 94944 15165. [P-872782]

■ ఆర్మీ, రైల్వే, నేవీ, ఎర్‌ఫోర్స్, CRPF, BSF, సివిల్ కానిస్టేబుల్,APSP, ITBPకై (స్త్రీ/పు)శిక్షణతో ఉద్యోగం పొందండి. అ:8–డిగ్రీ,ఫ్రీరూం, భో॥, జిమ్. వెంటనే ఫోన్ చేయండి. ఆర్మీ డిఫెన్స్, 9704112933. [W-618392]



■ 7th-డిగ్రీ పాస్/ఫెయిల్ ఐన 39 మంది స్త్రీ/పు కావలెను. జీ.రూ॥9500/–+ కమీషన్+ TA + ఫ్రీ రూమ్. సంప్ర॥ 26సం॥లోపు వారు : సింధూ ప్రమోషన్స్, బుద్ధపార్క్, ఏలూరు. 9700186006 [G-12269]

■ ప॥గో॥లోని MNC కంపెనీలో పర్మినెంట్ జాబ్స్ (male) రూం, ఫుడ్ ఫ్రీ. నెలకు అధిక సంపాదన. Qly : 10th to డిగ్రీ ఆపైన. Age : 18-27 ✆ 90528 88847 [B-0041]

■ ప్రయివేట్ బ్యాంకులలో మరియు ప్రముఖ ఆర్థిక సంస్థలో, ఫైనాన్స్ సెక్టార్‌లో ఉద్యోగ అవకాశములు కలవు. వయస్సు : 18–35సం॥లు అర్హత: ఇంటర్ to పి.జి. సెల్: 91541 47858. [R-20]

■ మీరు నిరుద్యోగులా: అయితే మా సంస్థ ద్వారా మీ ఏరియాల్లో ఫుల్‌టైం+పార్ట్‌టైం జాబ్ చేయుటకు M/F 10 మందికి అవకాశం కలదు. ఆకర్షణీయమైన జీతం. 95735 98367. [R-215]

■ ఇంటిపని, వంటపని, పిల్లలను చూసుకొనుటకు ఆడవారు కావలెను. హిందీ మాట్లాడు వారికి ప్రాధాన్యత. జీ:10–15వేలు. భోజనం+ వసతి. H.No. MIG 225,లింగంపల్లి,Hyd.8639669200, 9182662312. [H-693508]



గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పాడి-పంట

సస్యరక్షణతో లాభాల అరటి

పెరవలి :



అరటి తోటలపై వివిధ రకాల తెగుళ్లు ఆశించి ఉన్నాయని ముఖ్యంగా మొక్క తోటలపై వీటి ప్రభావం అధికంగా ఉందని వ్యవసాయాధికారి పి.చంద్రశేఖర్ తెలిపారు. ప్రస్తుతం తోటలపై సిగటోక, లద్దె పురుగులు ఎక్కువగా ఆశించి ఉన్నాయని చెప్పారు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల తేమశాతం పెరగటంతో మొక్క తోటలపై సిగటోక, లద్దె ఎక్కువగా ఆశించి ఉండటంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. వీటికి మొదటి దశలోనే నివారణ చర్యలు చేపడితే తోటలను కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు.



పెరవలి మండలం ఖండవల్లిలో తెగులు సోకిన అరటి తోట, పి.చంద్రశేఖర్ వ్యవసాయాధికారి

సిగటోకతో తీవ్ర నష్టం



ఖండవల్లిలో సిగటోక తెగులు సోకి మాడిపోయిన ఆకు

సిగటోక తెగులు డెల్టా ప్రాంతంలో అరటి తోటలపై అధికంగా ఉంది. ఇది మొక్క పంటలపై ఎక్కువగా ఆశించడం వల్ల తోటలకు తీవ్ర నష్టం కలుగుతుంది. ఈ తెగులు ప్రభావం వర్షాకాలంలో ఎక్కువగా ఉంటుంది. ఆకులపై చిన్న మచ్చలుగా ఏర్పడి క్రమేపీ పెద్దవై మధ్యలో బూడిద రంగు కలిగి ఉంటాయి. ఈ మచ్చలు గోధుమ రంగుకి మారి ఒకదానితో ఒకటి కలిసిపోయి ఆకులు ఎండిపోతాయి. గెలలు తయారయ్యే సమయంలో తెగులు తీవ్రమైతే నష్టం ఎక్కువగా ఉంటుంది.

నివారణ చర్యలు

తెగులును నివారించడానికి తోటల్లో కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. నీరు పెట్టిన వెంటనే ఆరిపోయేలా చూడటంతో పాటు నీరు నిల్వ లేకుండా చూడాలి. అధికారుల సూచనల మేరకు నత్రజని, పొటాష్ ఎరువులను వాడాలి. మొక్క చుట్టూ ఉన్న పిలకలను తొలగించాలి. దీని నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా క్లోరోథలోనిల్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి తెగులు సోకిన మొక్కలపై పిచికారీ చేయాలి.

నిలువునా ముంచేసే 'లద్ది'



లద్దిపురుగులు తినేస్తున్న ఆకు

లద్ది పురుగులు ఎక్కువగా లేత తోటలపై ఆశిస్తాయి. ముువ్వ ఆకులను ఆశించి పత్రహరితాన్ని గోకి తినేస్తాయి. ముదర ఆకులను ఆశించి ఆకులను తినేస్తాయి. దీని ప్రభావం ఎక్కువగా ఉంటే నివారణ చేయడం చాలా కష్టం. లద్ది సోకిందని గమనించిన వెంటనే చర్యలు తీసుకుంటే తోటలకు ఎటువంటి నష్టం వాటిల్లదు.

నివారణ చర్యలు

లద్ది నివారణకు నువాల్జురాన్ రెండు మిల్లీలీటర్లు లేదా క్లోరోంట్రానిలిప్రోల్ 60 మిల్లీలీటర్లు లేదా ఫైనోసాడ్ 60 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే నివారించవచ్చు. లద్ది పురుగులు పెద్ద సైజులో ఉంటే అరకిలో బెల్లం, మోనోక్రోటోపాస్ అరలీటరు లేదా క్వినాల్‌పాస్ అరలీటరు కలిపి ఉండలుగా చేసి సాయంత్రం వేళల్లో మొక్క చుట్టూ వేస్తే వాటిని తిని చనిపోతాయి.

గళమెత్తిన కంప్యూటర్ ఆపరేటర్లు

ఏలూరు రూరల్ :



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు

రెండేళ్లుగా జీతాలు లేక పిల్లా పాపలతో అల్లాడుతున్నామని ఈ–పంచాయతీ డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఏపీ ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 190 ఆపరేటర్లకు 2015 మే నెల నుంచి జీతాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో ఆపరేటర్‌కు రెండు క్లస్టర్లు అప్పగించి ఇంటి పన్నులు, కుళాయి, బిల్డింగ్ అనుమతులు తదితర పనులు చేయించడం వల్ల తీవ్ర పనిభారం పడుతోందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా గంటకు రూ.50 వేతనంతో ఆపరేటర్లు పనిచేయడం సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 151 ప్రకారం ప్రభుత్వం ఆపరేటర్‌కు రూ.15 వేల కనీస వేతనం చెల్లించాలని నినదించారు. గ్రామానికి ఒక ఆపరేటర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం సభ్యులు డీపీఓకు సైతం వినతిపత్రం అందించారు.

అతిక్రమణకు తప్పదు మూల్యం

- వాహనచోదకులూ తస్మాత్ జాగ్రత్త
- నగరంలో పెరిగిన రవాణా శాఖ తనిఖీలు
- వందల్లో కేసులు.. వేలల్లో జరిమానాలు

ఏలూరు అర్బన్: రాష్ట్ర రవాణా శాఖ అధికారులు వాహనచోదకులపై కొరడా ఝుళిపిస్తున్నారు. నిబంధనలు పాటించకపోతే భారీగా అపరాధ రుసుములు వసూలు చేయడంతోపాటు వాహనాలను సైతం సీజ్ చేసి కేసులు నమోదు చేసి కోర్టులకు తరలిస్తున్నారు. ఇటీవల తరచుగా ఏలూరు నగరంలోని అన్ని కూడళ్లలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. నిర్ణీత వ్యవధిలో వాహనం రిజిస్టర్ చేయించకపోయినా వాహనంపై నంబర్ లేకున్నా, మద్యం తాగి వాహనం నడిపినా సదరు వాహనాలను సీజ్ చేసి వాహనాలు నడిపే వారిపై కేసులు పెడుతున్నారు. ఇదేక్రమంలో కార్లలో సీట్ బెల్టు లేకుండా ప్రయాణిస్తున్నా, సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపినా, డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా కేసులు పెడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నారు. జూలై నెలలో ఏలూరు నగరంలో రవాణా శాఖ అధికారులు నమోదు చేసిన కేసుల వివరాలు ఇలా ఉన్నాయి.

నిబంధనలు పాటించకుంటే కేసులు

రోడ్డు ప్రమాదాలు జరగకుండా రవాణా శాఖ అధికారులు నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. సూచనలు, సలహాలు ఇస్తున్నారు. అయినా కొందరు నిబంధనలు పాటించకపోవడం, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిల్లో ముఖ్యంగా వాహనాలు సరైన కండీషన్‌లో లేకపోవడం, మైనర్లు, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా రోడ్డు నియమాలు పాటించకుండా వాహనాలను విపరీతమైన వేగంతో నడపడం కారణంగా కనిపిస్తోంది. వీటిని నివారించేందుకు అధికారులు నిత్యం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కొన్ని కేసుల్లో వాహనాలను సీజ్ చేయడం, కోర్టుకు తరలించడంతో పాటు అపరాధ రుసుం కూడా వసూలు చేస్తున్నాం. ప్రజలు సహకరించి రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదరహితంగా ప్రయాణించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.



– సి.మల్లికార్జునరెడ్డి, ఆర్టీఓ, ఏలూరు



కేసులు	సంఖ్య	ఫైన్	వసూలు చేసిన మొత్తం
నంబర్ లేని వాహనాలు	143	250	రూ.35,750
హెల్మెట్ లేనివి	415	250	రూ.1,03,750
సీటు బెల్టులేనివి	121	500	రూ.60,500

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 60, రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించని వారిపై 3,116 కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించారు. 143 ద్విచక్రవాహనాలు, 21 ఆటోలను సీజ్ చేశారు.

నిలకడగా గోదావరి వరద

- 55,267 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి..
- పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం ఆనకట్ట నుంచి సముద్రంలోకి వదులుతున్న వరద నీరు

కొవ్వూరు: గోదావరిలో వరద నిలకడగా ఉంది. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద సోమవారం సాయంత్రం నీటిమట్టం 10.80 అడుగులుగా నమోదైంది. ఆనకట్టకు ఉన్న 175 గేట్లను 0.10 మీటర్లు ఎత్తులేపి 55,265 క్యూసెక్కుల వరదను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని మూడు డెల్టాలకు ఆదివారం కంటే 500 క్యూసెక్కుల నీటి విడుదల తగ్గించారు. తూర్పు డెల్టాకు 2,600 సెంట్రల్ డెల్టాకు 1,900, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కు ల చొప్పున నీరు వదులుతున్నారు.

పశ్చిమ డెల్టాకు కుదింపు

పశ్చిమ డెల్టాకు ఆదివారం 3,500 క్యూసెక్కుల నీరు విడుదల చేసిన అధికారులు సోమవారం సాయంత్రం నుంచి 3,000 క్యూసెక్కులకు కుదించారు. జీ అండ్ వీ కెనాల్‌కి 298, నరసాపురం కాలువకి 771, ఉండి కెనాల్‌కి 1,087, ఏలూరు కాలువకి 548, అత్తిలి కెనాల్‌కి 237 క్యూసెక్కుల చొప్పున సాగునీరు విడుదల చేస్తున్నారు.

కాపుల జలదీక్ష



ఆచంట మండలం కోడేరు వశిష్ట గోదావరిలో జలదీక్ష చేస్తున్న కాపులు

ఆచంట: కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం పాదయాత్రకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని కోరుతూ సోమవారం ఆచంట మండలం కోడేరులోని వశిష్ట గోదావరిలో కాపులు జలదీక్ష చేశారు. సుమారు గంట సేపు సాగిన దీక్షలో మండల కాపు సంఘం ఉపాధ్యక్షుడు గణేశుల సత్తిబాబు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పాదయాత్రకు పూనుకుంటే ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం కాపులను అణచివేయడమేనని అన్నారు. హామీ అమలు చేయకపోవడం వల్లే కాపులు రోడ్డెక్కాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమాలను పోలీసులతో అణచివేయాలని చూస్తే సహించేది లేదని, భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన వస్తుందని హెచ్చరించారు. జలదీక్షలో కాపు సంఘం నాయకులు రామిశెట్టి రాము, గణేశుల నాగేశ్వరరావు, బండారు కృష్ణ, నారిన శ్రీనివాసు, వలవల ఏసుదాసు, సుంకర బుజ్జి, నారిన నాగరాజు, కుంపట్ల రమేష్, కురసాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చని అసమర్థ ప్రభుత్వం



తాడేపల్లిగూడెంలో కాపు జిల్లా మహిళ అధ్యక్షురాలు కొత్తపల్లి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో కంచాల మోత

తాడేపల్లిగూడెం (తాలూకా ఆఫీస్ సెంటర్): కాపు జిల్లా మహిళా అధ్యక్షురాలు కొత్తపల్లి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం 1వ వార్డు గణేష్‌నగర్‌లో బొగడపాటి సత్యవతి నివాసం వద్ద మహిళలు సోమవారం కంచాలపై స్పూన్‌లతో కొడుతూ ఆకలి చప్పుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముద్రగడ పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని కొత్తపల్లి సుబ్బలక్ష్మి డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను మాత్రమే అడుగుతున్నామని, ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేని అసమర్థ ప్రభుత్వం ఇదని విమర్శించారు. ఏడాదికి రూ.వెయ్యి కోట్లు, బీసీ స్టేటస్ వంటి హామీలను మూడేళ్లు పూర్తయినా సీఎం చంద్రబాబు నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. ఉద్యమం చేస్తున్న వారిని గృహ నిర్బంధం పేరుతో హింసలు పెట్టడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి ముద్రగడ పాదయాత్రకు అనుమతి ఇవ్వడంతో పాటు హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జుట్టా వీర భారతి, ఇళ్ల కుమారి, కనుమరెడ్డి రత్నకుమారి, డి.కనకదుర్గ, నిహారిక, లక్ష్మి, సత్యవతి, మంగ, లక్కినేని నాగపుష్పావతి, మురళీకృష్ణ, సునీత, ఆరేటి దుర్గ పాల్గొన్నారు.

13.9 మి.మీ సగటు వర్షపాతం

ఏలూరు (ఆర్‌ఆర్ పేట): జిల్లాలో గత 24 గంటల్లో 13.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైందని సీపీఓ బాలకృష్ణ తెలిపారు. ఆకివీడు మండలంలో 57.8 మిల్లీమీటర్లు, వీరవాసరం 50.8, ఉండి 49, దేవరపల్లి 42.6, టి.నరసాపురం 39.2, పాలకోడేరు 37, దెందులూరు 33, జంగారెడ్డిగూడెం 31.4, జీలుగుమిల్లి 23.2, ఏలూరు 6.2, పోలవరం 21, కొయ్యలగూడెం 10, చింతలపూడి 20, కామవరపుకోట, ద్వారకాతిరుమలలో 5.5, నల్లజర్ల 29, తాడేపల్లిగూడెం 20, ఉంగుటూరు 5, భీమడోలు 4, పెంటపాడు 14, తణుకు 7, ఉండ్రాజవరం 9, పెరవలి 11, కాళ్ల 23, పాలకొల్లు 16, నర్సాపురం 21, మొగల్తూరు 9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

రైలు నుంచి జారిపడి మృత్యువాత



నందం సుబ్బారావు మృతదేహం

అత్తిలి: అత్తిలి మండలం మంచిలి రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతుండగా జారిపడి నందం సుబ్బారావు (60) అనే వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంచిలి గ్రామానికి చెందిన సుబ్బారావు సోమవారం సాయంత్రం భీమవరం నుంచి నిడదవోలు వెళ్లే రైలులో ప్రయాణిస్తూ మంచిలిలో రైలు దిగుతుండగా ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందాడు. రెల్వే ఎస్సై ఏవీ ప్రసాద్ కేసు నమోదు చేశారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం

పెంటపాడు: మండలంలోని కె.పెంటపాడులో లోలెవిల్ కాలువ వంతెన కింద గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతదేహం వంతెన కింద గుర్రపుడెక్కలో చిక్కుకుంది. వీఆర్వో శర్మ ఫిర్యాదు మేరకు పెంటపాడు ఎస్సై వాసంశెట్టి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ జానకిరావు మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుని వయసు 38 నుంచి 42 ఏళ్లు ఉండవచ్చని, చారల చొక్కా, నలుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడని ఎస్సై తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో కృష్ణావాసి మృతి

పెనుమంట్ర : పెనుమంట్ర మండలం భట్లమగుటూరులో ప్రధాన రహదారి పక్కన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై జీజే ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పోడూరు మండలం తూర్పుపాలెంకి చెందిన గెద్దాడ ఆంజనేయులు (65) కొన్నాళ్ల క్రితం కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం నాగమ్మ చెర్వు గ్రామానికి వలస వెళ్లాడు. ఈ నేపథ్యంలో భట్లమగుటూరులో శవమై కనిపించాడు. పురుగు మందు తాగి మృతిచెందినట్టు పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

వైద్యులు, స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలకు

దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్: జిల్లాలోని వివిధ ప్రభుత్వాస్పత్రుల్లో 66 డాక్టర్ ఉద్యోగాలు, 25 స్టాఫ్ నర్సు ఉద్యోగాలను కాంట్రాక్ట్ పద్ధతిపై భర్తీ చేయనున్నట్టు జిల్లా వైద్య విధాన పరిషత్ కో–ఆర్డినేటర్ డాక్టర్ శంకరరావు ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 13 ప్రసూతి వైద్యులు, 11 మంది మత్తు డాక్టర్లు, 12 మంది పిల్లల వైద్యుల పోస్టులతో పాటు 25 మంది స్టాఫ్ నర్సు ఉద్యోగాల కోసం ఈనెల 8లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని, వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వెస్ట్‌గోదావరి.ఓఆర్‌జీలో పొందుపర్చామని పేర్కొన్నారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో 11 డాక్టర్ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. వీరిలో ముగ్గురు గైనకాలజిస్టులు, ఇద్దరు మత్తు డాక్టర్లు, ఒక పిల్లల వైద్యుడు, ఒక జనరల్ వైద్య నిపుణుడు, ఒక జనరల్ సర్జన్, ముగ్గురు జనరల్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు.

ఎంఆర్ టీకాతో రెండు వ్యాధులకు చెక్

డీఎంహెచ్‌ఓ కోటేశ్వరి



ఏలూరు అర్బన్: ఎంఆర్ టీకాతో చిన్నారుల పాలిట ప్రాణాంతకంగా మారిన రెండు వ్యాధులను నివారించవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.కోటేశ్వరి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మీజిల్స్ (తట్టు), రుబెల్లా (ఎర్ర దద్దుర్లు) అనే రెండు వ్యాధుల బారిన పడి 9 నెలల నుంచి 15 ఏళ్ల వయసు ఉన్నవారు ప్రాణాలు కోల్పోతున్న కేసులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వారిని కాపాడేందుకు ప్రభుత్వం ఎంఆర్ పేరిట కొత్త టీకాను పిల్లలకు ఇచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమం రూపొందించిందన్నారు. ఈ టీకాలు జిల్లావ్యాప్తంగా ఇప్పటికే గుర్తించిన తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్ల వయసున్న 8,36,537 మందికి అందించేందుకు కార్యాచరణ రూపొందించామని చెప్పారు. మంగళవారం నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకూ ప్రత్యేక అవగాహన, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వాస్పత్రులు, పీహెచ్‌సీల్లో టీకాలు వేస్తారని పేర్కొన్నారు. టీకా పూర్తి సురక్షితం కావడం వల్ల చిన్నారులందరికీ తప్పక వేయించాలని సూచించారు. సాధారణ జ్వరం, అనారోగ్యం ఉన్నా నిరభ్యంతరంగా ఎంఆర్ టీకా వేయవచ్చని చెప్పారు. డీఐఓ డాక్టర్ డి.మోహనకృష్ణ, పీఓడీటీటీ జె.నాగేశ్వరరావు, డెమో సీహెచ్ నాగేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పి.విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమ్మపాలు అమృతం

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

నిడమర్రు, నిడదవోలు రూరల్ :

తల్లి పాల విశిష్టత, ప్రాముఖ్యతను చాటేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి వారం రోజుల పాటు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 1న ప్రపంచ వ్యాప్తంగా తల్లిపాల దినోత్సవం జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో మన ఐసీడీఎస్ అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్టు మొదటి వారంలో వారోత్సవాలు చేపడుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే గ్రామ, మండల, జిల్లాస్థాయిలో కార్యక్రమాలు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించడానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో నాలుగు రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య శాఖ అనుబంధంతో ఈ కార్యక్రమాలను చేపట్టనున్నట్టు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

ముర్రు పాలు తప్పనిసరి

బిడ్డ పుట్టిన మొదటి అరగంటలోపు తల్లులకు వచ్చే పాలను ముర్రుపాలు అంటారు. ఇవి కచ్చితంగా శిశువుకు పట్టాలని ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.అర్చన సూచిస్తున్నారు. దీనివల్ల రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకాహార పదార్థాలు అందుతాయని, ఇందులో మాంసకృతులు, విటమిన్ ఏ ఉంటాయని తెలిపారు. ఆమె మరికొన్ని సూచనలు చేశారు.

- వ్యాధులు రాకుండా మర్రుపాలు బిడ్డకు జీవిత కాలం కాపాడుతాయి.
- శిశువు పేగులను శుభ్రం చేసి, మొదటి మల విసర్జనకు తోడ్పడతాయి.
- తల్లులు సహజంగా బిడ్డకు సరిపడా పాలురావడం లేదని అనుకోవడం అపోహ మాత్రమే.
- బిడ్డ పుట్టగానే పాలు మూడు, నాలుగు రోజుల వరకు పడవని తేనె నాకించడం, పంచదార నీళ్లు ఇవ్వడం, గ్లూకోజ్ నీళ్లు ఇవ్వడం చెయ్యకూడదు.
- బిడ్డకు పాలు పట్టించడం వల్ల తల్లికి కలిగే లాభాలు
- తల్లులు చనుబాలు ఇవ్వడం వల్ల గర్భధారణ తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గడంతో పాటు త్వరగా కోలుకుంటారు. జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు.
- చనుబాలు ఇచ్చినందువల్ల ఊబకాయం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. గర్భానికి పూర్వం ఉన్న బరువును తిరిగి పొందగలుగుతారు.
- బిడ్డకు పాలు పట్టించడం వల్ల రొమ్ము, గర్భసంచి క్యాన్సర్లు రావు
- తల్లులకు మలి వయసులో వచ్చే ఆస్టియోపొరొసిస్ (ఎముకల బలహీనత) నుంచి కాపాడుతుంది.
- ఆరు నెలల వరకు బిడ్డకు తప్పనిసరిగా రోజుకు 8 నుంచి 10 సార్లు పాలు ఇవ్వాలి.



తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానం. శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు దోహదం చేయడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అందుకే తల్లి పాలను బిడ్డ పుట్టిన వెంటనే పట్టిస్తారు. పాలు పట్టడంతో అటు తల్లికీ అనేక లాభాలున్నాయి. రోగనిరోధక శక్తిని పెంపొందించి ఎన్నో రకాల వ్యాధులు రాకుండా ఉంటాయి. తల్లిపాలకు ఇంతటి విశిష్టత ఉండబట్టే వైద్యులు, ప్రభుత్వం మహిళల్లో చైతన్యం కలగజేస్తోంది. నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు జరుగుతున్నాయి.

తల్లి పాలతో బిడ్డకు కలిగే లాభాలు

- తల్లి పాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి.
- నాణ్యమైన ప్రొటీన్లు, ఒమెగా 3, 6, 9 బిడ్డ మెదడుకు వికాసానికి తోడ్పడతాయి.
- ఈ పాలలో బిడ్డలకు అవసరమయ్యే విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.
- ఇందులోని లాక్టోజ్ వల్ల కాల్షియం నిల్వలు పెరుగుతాయి, బిడ్డను రక్తహీనత నుంచి కాపాడతాయి.
- తొలి నెలలో శిశువులకు వివిధ రకాల అంటువ్యాధుల బారి నుంచి కాపాడుతాయి.
- బిడ్డ మనోవికాసానికి తోడ్పతుతాయి.
- బిడ్డ మల విసర్జనకు, మలబద్ధకం సమస్య నివారణకు తోడ్పడతాయి. జీర్ణ మండలాన్ని వృద్ధి చేస్తాయి.

వ్యాధులు దూరం

తల్లిపాలలో విటమిన్లు, మాంసకృతులు, కార్బోహైడ్రేడ్స్, కొవ్వు పదార్థాలు, మినరల్స్, ఎ, బీ, సీ,డీ, కె విటమిన్లు, హిమోగ్లోబిన్, నీటి శాతం అధికంగా లభిస్తాయి. అందువల్ల పిల్లలకు ఎక్కువగా వ్యాధులు రావు. బిడ్డకు సమతుల ఆహారం అందుతుంది. పోతపాలతో బిడ్డల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కాలేయం, ఊబకాయం రావడం, షుగర్ వ్యాధి సమస్యలు వేధించే అవకాశం ఉంది. ఇక తల్లి పాలని తాగే పిల్లల్లో దీర్ఘకాలిక రోగాలు, కామెర్లు వచ్చే అవకాశం ఉండదు.

ఔషధమిలా..

అమ్మపాలలో 60–80 శాతం నీళ్లుంటాయి.100 ఎంఎల్ పాలల్లో 1.1 గ్రాముల ప్రొటీన్‌లు, 6.5 గ్రాముల లాక్టోస్, 3.5 గ్రాముల కొవ్వు పదార్థాలుంటాయి. ఎముకలకు అవసరమైన కాల్షియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటుంది. రక్తం పెరిగేందుకు ఐరన్ 0.29 ఎంజీ, పొలిక్‌యాసిడ్ 0.14 యూజీ (మైక్రోగ్రామ్ కన్నా తక్కువ) విటమిన్ బి–120.45 యూజీ, విటమిన్ సీ 1.2 ఎంజీ. విటమిన్ ఏ 0.5 ఐయూ (ఇంటర్నేషనల్ యూనిట్స్), విటమిన్–డి 0.5 ఐయూ, విటమిన్ కే 1.5 యూజీ తదితర పోషకాలుంటాయి. అందుకే ఇవి దివ్య ఔషధంతో సమానం.

నేటి నుంచి వారోత్సవాలు



తల్లిపాల విశిష్టతను ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. వారోత్సవాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ముందస్తుగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాం. వారు మహిళలకు అవగాహన కల్పిస్తారు.

– కేపీవీఎల్ పద్మావతి, సీడీపీవో, గణపవరం

పోషకాహారం తీసుకోవాలి



తల్లి పాలు పుష్కలంగా రావాలంటే గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లిపాయ, తాజా కూరగాయలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి. పండ్లు శుభ్రంగా కడిగిన తర్వాత తినాలి.

– ఎస్.అర్చన, ప్రసూతి వైద్య నిపుణులు, ఉంగుటూరు

నాటకాల్లో మెగాస్టార్ మద్దాల


తాడేపల్లిగూడెం : దేశ రాజధాని హస్తినాపురంలో ఆయన నాటకం ఆడుతుంటే ప్రేక్షకులు క్యూ కట్టేవారు. 40 ఏళ్ల క్రితం ఆయన డ్రామా చూడాలంటే అక్షరాలా రూ.150 పెట్టి టిక్కెట్ కొనుక్కోవాల్సిందే. నాటకాల్లో దేశాన్ని రంజింప చేసిన వ్యక్తి మహానటుడు మద్దాల రామారావు. నాటక చరిత్ర పుటల్లో ఆయన మెగాస్టార్‌గా చిరస్థాయిగా నిలిచారు. భూకైలాస్ సినిమాలో ఎన్టీఆర్‌ను, భూకైలాస్ నాటకంలో మద్దాలను పాత్రల్లో చూస్తే ఎన్టీఆర్ కంటే బాగా చేశాడనే కితాబులను ఎన్నోసార్లు మద్దాల రామారావు పొందారు. అంతేకాదు ఎన్టీఆర్ స్వయంగా మద్దాలను ఇంటికి పిలిపించుకుని భూకైలాస్‌లోని డైలాగ్‌లు చెప్పించుకున్నారంటే ఆయన నటనా కౌశలం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అత్తిలిలో టేకు ఫకీర్ స్కూల్, రేలంగిలో ప్రగడ భద్రం నాటక పాఠశాల నాటకాన్ని, పాత్రలను అజరామంగా ప్రేక్షకుల మదిలో కలకాలం నిలిచేలా చెక్కారు.

జల్లికొమ్మరలో జననం

తాడేపల్లిగూడెం సమీపంలోని జల్లికొమ్మరలో 1927లో జన్మించిన మద్దాల ఎనిమిదేళ్లప్రాయంలో నాటక రంగ ప్రవేశం చేశారు. అత్తిలికి చెందిన టేకు ఫకీర్ నాటక ట్రూపులో లవకుశ నాటకంలో లవుడిగా పాత్రను పోషించిన ఆయన ఇక వెనుతిరిగి చూసుకోలేదు. రేలంగికి చెందిన ప్రగడ భద్రం ఆధ్వర్యంలోని హిమగిరీశ నాట్యమండలిలో భద్రం రచించి, రూపొందించిన తులసీ జలంధర నాటకం రామారావుకు స్టార్ ఇమేజ్‌ను తీసుకొచ్చింది. తులసీ జలంధర, మైరావణ, భూకైలాస్ నాటకాలతో దేశ వ్యాప్తంగా రామారావు నాటకాలను ప్రదర్శించారు. అప్పట్లో 32 రోజులు 32 గ్రామాల్లో నాటకాలను ప్రదర్శించిన ఏకైక నటుడు మద్దాల రామారావు. ఒక్కోసారి ప్రేక్షకులు కిక్కిరిసిపోయి నాటకం చూసే అవకాశం లేకపోవడంతో తెరలను తీసి వేసి నాలుగువైపులా నాటకం కనిపించేలా ఏర్పాటు చేసిన ఘనత ఒక్క మద్దాల రామారావు నాటకానికే ఉంది. జలంధర, మైరావణ, రావణాసురుడు, తాండ్ర పాపారాయుడు, భస్మాసుర, కర్ణుడు, యయాతి, విశ్వామిత్ర వంటి పాత్రలతో ఏడు వేలకు పైగా నాటకాలను ఆయన ప్రదర్శించారు. 84 ఏళ్ల వయసుతో వయోభారం కారణంగా ఇంటి వద్ద కొంతకాలంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో సోమవారం తుదిశ్వాస విడిచారు.



ఏఎన్ఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మద్దాల రామారావు



వివిధ వేషధారణల్లో మద్దాల



కల్యాణ వైభోగమే



పెళ్లంటే మూడు ముళ్లు.. ఏడడుగులే కాదు.. ఇద్దరి జీవితాల నూరేళ్ల పంట. పెళ్లితో ఒక్కటై కొత్త జీవితాలను ఆరంభించే యువజంటలు తమ వివాహాన్ని జీవితకాలం గుర్తించుకునేలా ఘనంగా జరుపుకోవాలని తహతహలాడుతుంటారు. ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుకావడం, ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో కల్యాణ తీరుతెన్నుల్లో ఇటీవల భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. స్థితిమంతుల ఇంట జరుగుతున్న వివాహాల్లో విఘ్నేశ్వర పూజ, సుముహూర్తం, కన్యాదానం, ప్రదానం.. వంటి సంప్రదాయాలతో పాటు ఆధునిక హంగులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పెండ్లి కుమారుడు, కుమార్తెల మధ్య బాక్స్ గేమ్, కృత్రిమంగా మేఘాల సృష్టి, బావ గారి కాశీయాత్ర ట్రెండ్, గొడుగులకు సొబగుల తళుకులు, సినిమాటిక్‌గా బెలూన్ల నుంచి వధూవరుల ప్రత్యక్షం, పెళ్లికి సంబంధించి టీజర్ విడుదల.. వంటి నయా ట్రెండ్‌లు ఆహుతులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి.

- తాడేపల్లిగూడెం




ప్రేమాభిషేకం



బెలూన్‌లో నవజంట



బాక్స్‌లో వధువు





బుట్టలో పెళ్లికూతురు



కళారాధన

పాలకొల్లు సెంట్రల్ :

స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కళారాధన నివేదన కార్యక్రమంలో భాగంగా నరసాపురం తోలేటి శ్రీనివాస్ బృందంచే భక్తి గీతాలాపన కార్యక్రమం జరిగింది. దాతల సహకారంతో సుమారు 500 భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి పంచహారతుల కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శివదేవకు పూజలు

పాలకొల్లు అర్బన్ :

వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవుని చిక్కాలలోని శివదేవస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. పార్వతీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు శాంతిహోమాలు,అభిషేకాలు చేయించుకున్నారు. సంతాన ప్రాప్తి కోసం దంపతులు ఆలయ ఆవరణలో కొబ్బరిమొక్కలు నాటారు, ఆలయ ఈవో చిట్టూరి వెంకటేశ్వరరావు, అర్చకులు ర్యాలి శివాజీ, ర్యాలి కాశి, ర్యాలి సతీష్, ర్యాలి సూర్యప్రకాశరావు భక్తులకు సేవలందించారు.



స్పాట్ బహిష్కరణ రోజుకు క్యాజువల్ లీవ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఫ్యాప్టో, జాక్టో ఆధ్వర్యంలో ఏప్రిల్ 11న 10వ తరగతి స్పాట్ వాల్యూయేషన్ బహిష్కరణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు క్యాజువల్ లీవ్/స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబ్జి, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు చేసిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ ఈ నెల 28న ఇందుకు సంబంధించిన నంబర్ 577416 మెమో జారీ చేసినట్లు తెలిపారు.

6న తణుకులో రెడ్డి వధూవరుల పరిచయ వేదిక



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

తణుకు టౌన్ : జిల్లాలోని రెడ్డి జనసంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 6న రెడ్డి వధూవరుల పరిచయ వేదికను తణుకులో నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు తమనంపూడి వెంకటరెడ్డి, కార్యదర్శి కర్రి కాశీవిశ్వనాథరెడ్డి తెలిపారు. సోమవారం తణుకు రెడ్డి కల్యాణ మండపంలో రెడ్డి వధూవరుల పరిచయ వేదిక వాల్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. తణుకులోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పడాల త్రిమూర్తిరెడ్డి, కస్తూరి కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, వివరాలకు టి.వెంకటరెడ్డి సెల్ నంబర్ 94404 86177, తాడి భీమారెడ్డి సెల్ నంబర్ 99597 86677లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి జన సంఘం నాయకులు రామచంద్రారెడ్డి, చంటిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, కె.వెంకటరెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛత పక్షోత్సవాలు

ఏలూరు రూరల్ : స్వచ్ఛత పక్షోత్సవాలు ఈ నెల 1 నుంచి 15 వరకూ నిర్వహిస్తున్నట్టు జిల్లా యూత్ కోఆర్డినేటర్ కె.వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. యువజన సంఘాలు, మహిళా సంఘాలు, నేషనల్ యూత్ కాప్స్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీతోపాటు స్వచ్ఛంద సంస్థలు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాయని వివరించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత అవశ్యకతపై అవగాహన, సొంత గ్రామం పరిశుభ్రత, బహిరంగమల విసర్జన నిర్మూలనతో పాటు అంగన్‌వాడీ, పంచాయతీ భవనం, ప్రముఖల విగ్రహాల శుభ్రత, సామూహిక ప్రదేశాల్లో శ్రమదానం, యువచైతన్య ర్యాలీ నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ఎన్‌వైకే అనుబంధ సంస్థలు తాము నిర్వహించిన కార్యక్రమాలను రిపోర్టులు, ఫొటోలు ఏలూరులోని నెహ్రూ యువకేంద్రానికి అందజేయాలని సూచించారు. మెరుగైన పనితీరు కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

104 ఉద్యోగుల నిరాహారదీక్ష



కలెక్టరేట్ వద్ద దీక్ష చేస్తున్న 104 సిబ్బంది

ఏలూరు రూరల్: కనీస వేతనాలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులతో వెట్టి చాకిరీ చేయించుకుంటోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.రాజారామ్మోహన్‌రాయ్ దుయ్యబట్టారు. సోమవారం ఏపీ 104 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జీఓ 151 ప్రకారం 104 ఉద్యోగులకు కనీసం వేతనం రూ.17,500 చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా రీజినల్ కార్యదర్శి టీపీఆర్ దొర మాట్లాడుతూ 104 ఉద్యోగులకు కేరళ ప్రభుత్వం కనీసం వేతనంగా రూ.18 వేలు చెల్లిస్తుందన్నారు. దీక్షలో పాల్గొన్న సంఘం నాయకులు ఎ.సునీల్‌కుమార్, యు.చంద్రశేఖర్ మట్లాడుతూ కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, డైలీ అలవెన్స్ రూ.150, అక్రమ బదిలీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్ నియామకం, మందులు, కెమికల్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో ఎన్ఎన్‌వీవీ లక్ష్మి, కె.విద్యసాగర్, జి.వెంకటేశ్వరరావు, ఎం.భరత్‌కుభూషణ్, ఎస్.శివప్రసాద్, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధికార పార్టీ నేతల అవినీతి దందా

- మరుగుదొడ్ల నిర్మాణంలో కనికట్టు
- నిర్మాణం పూర్తికాకుండానే నిధులు డ్రా
- లబ్ధిదారుల నుంచి అదనపు వసూళ్లు
- స్వచ్ఛభారత్ మిషన్‌కు తూట్లు

టి.నరసాపురం :

మరుగుదొడ్ల పేరిట జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. చాలాచోట్ల అధికారుల అండదండలతోనే నిధులు దారిమళ్లినట్లు సమచారం. జిల్లాలోని ఏలూరు, టి.నరసాపురం తదితర మండలాల్లో ఇప్పటికే మరుగుదొడ్ల భాగోతాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. మరుగుదొడ్ల అవినీతిపై విచారణ జరిపించాలని దళితహక్కుల నాయకులు హైకోర్టులో ఇటీవల పిల్ దాఖలు వేశారు. నెలరోజుల్లో విచారణ జరిపి నివేదిక పంపాలని కోర్టు జిల్లా అధికారులను ఆదేశించింది.

స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నిర్ణీత సమయానికి మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేసేందుకు అధికారులు నానాహైరానా పడుతున్నారు. తమకు అప్పగించిన గ్రామాల్లో నూరుశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు కనికట్టు చేస్తున్నారు. నిర్మాణాలు పూర్తి చేయకుండానే ఆయా ఏజెన్సీల కాంట్రాక్టర్లు నిధులు మింగేశారనే ఆరపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్ల అవతారమెత్తిన అధికార పార్టీ నాయకులు పనులను దక్కించుకుని నిర్మాణాలు పూర్తి కాకుండానే పూర్తయినట్లు కాగితాల్లో మభ్యపెట్టి అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది. కొన్ని చోట్ల ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సరిపోవని లబ్ధిదారుల వద్ద రూ.1,500 నుంచి రూ.2,000 వరకు సొమ్ములు వసూలు చేసినట్లు బాధితులు గగ్గోలు పెడుతున్నారు. లబ్ధిదారులకు సొమ్ములు చెల్లించేసినట్లు ఆన్‌లైన్‌లో అంకెలు చెప్తున్నా, గ్రామాల్లో అసంపూర్తిగా మిగిలి ఉన్న మరుగుదొడ్లే దర్శనమిస్తున్నాయి.



బొర్రంపాలెం గ్రామంలో అసంపూర్తిగా మిగిలిపోయిన మరుగుదొడ్డి

బిల్లుల చెల్లింపులో కనికట్టు

టి.నరసాపురం మండలం బొర్రంపాలెం, రాజుపోతేపల్లి గ్రామాల్లో పెద్దసంఖ్యలో అసంపూర్తి నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. చాలా మరుగుదొడ్లకు పైన కప్పులు, లోన బేసిన్లు, డోర్లు కూడా ఏర్పాటు చేయలేదు. బొర్రంపాలెంలో జియోట్యాగింగ్ కోసం అధికారులు పైకప్పు కోసం ఒక రేకు, ముందు భాగంలో ఒక డోరు తీసుకువచ్చి తాత్కాలికంగా అమర్చి ఫొటో తీసుకుంటున్నారు. అనంతరం వెంటనే మరో మరుగు దొడ్డి వద్దకు వాటిని తీసుకెళ్లి అమర్చిన ఘటనలు ఉన్నాయి. బొర్రంపాలెంలో సోడెం సత్యవతి, ఇంటిమాల గంగాధర్, పులమ్మ, రాజుపోతేపల్లి గ్రామంలో పాడేటి గరటమ్మ, పి.పరదేశి, చింతలపూడి సూరమ్మ తదితరుల మరుగుదొడ్లు పూర్తి కాకుండానే వారి పేరిట ఆన్‌లైన్‌లో పూర్తిగా బిల్లులు చెల్లించినట్లు ఉంది.

గణాంకాలకే పరిమితం

సంపూర్ణ పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ కేంద్రం రూ.9 వేలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.6 వేలు మొత్తం రూ.15 వేలు చొప్పున వ్యక్తిగత మరుగుదొడ్లకు మంజూరు చేస్తున్నాయి. మన జిల్లాలో స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా మంజూరైన 1,82,225 మరుగుదొడ్లలో 1,80,639 నిర్మాణం పూర్తయినట్లు చెప్తున్నారు. రూ.264.17 కోట్లు మంజూరుకాగా ఇప్పటికి రూ.261 కోట్లు ఖర్చు చేసినట్లు గణాంకాలు చెప్తున్నాయి. జిల్లాలో ఇంకా 1586 మరుగుదొడ్లు మాత్రమే పెండింగ్ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

పోలీస్ కేసులు పెడతాం

కాంట్రాక్టర్లకు అడ్వాన్సులు చెల్లించి మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాం. మండలంలో మరుగుదొడ్ల నిర్మాణంలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు నా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాను. అవసరమైతే బాధ్యులపై పోలీస్ కేసులు పెడతా.

– ఎస్.వేణు గోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ, టి.నరసాపురం మండలం


మరుగుదొడ్డి పూర్తి చేయలేదు



నాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రుద్రోగంతో బాధపడుతున్నాడు. నరాల బలహీనపడ్డాయి. మరుగుదొడ్డి పూర్తి కాక పోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. చుట్టు పక్కల వారి మరుగుదొడ్డిని వాడుకోవాల్సి వస్తోంది. మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోవని నా వద్ద రూ.2 వేలు తీసుకున్నారు. గొయ్యి కూడ మేమే తవ్వుకున్నాం. గతంలో హడావుడిగా మరుగుదొడ్డి తలుపు, దొడ్డిపైన రేకు తీసుకు వచ్చి అమర్చారు. ఫొటో తీసుకున్నాక గ్రామంలోని మరో దొడ్డి వద్దకు అమర్చడానికి తీసుకెళ్లిపోయారు. ఇంత వరకు మరుగుదొడ్డి నిర్మాణం పూర్తిచేయలేదు.

– సోడెం సత్యవతి, బొర్రంపాలెం, టి.నరసాపురం మండలం

నా డబ్బులు కాజేశారు



నాకు మంజూరుచేసిన మరుగుదొడ్డి నిర్మాణం పూర్తయినట్టు నిధులు డ్రా చేసేశారు. ఇదేంటని అడిగితే అధికారుల నుంచి సరైన సమాధానం లేదు. మరుగుదొడ్డిలేక ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– పాడేటి లక్ష్మయ్య, రాజుపోతేపల్లి

సమగ్ర విచారణ చేయాలి



టి.నరసాపురం మండలంలో మరుగుదొడ్ల నిర్మాణంలో అవకతవకలపై విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ చేయాలి. మరుగుదొడ్లు పూర్తి కాకుండానే నిధులు డ్రా చేశారు. ఆ నిధులు ఏమయ్యాయో తేల్చాలి.

– గుండే పాండురంగ, బొర్రంపాలెం, సామాజిక కార్యకర్త

కలెక్టరేట్ ముట్టడిలో ఉద్రిక్తత

ఏలూరు (ఆర్ఆర్‌పేట):

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టర్ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా 10 మంది విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి అనంతరం సొంత పూజీకత్తుపై విడుదల చేశారు. తొలుత నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రం ఏలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించాలని, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే సాకుతో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు మూసివేయడం తగదని, విద్యాహక్కుచట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, సదుపాయాలు కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్ ఫీజులు, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర అధ్యక్షుడు ఎ.శ్రీకాంత్, జిల్లా కన్వీనర్ భవాని శంకర్, కార్యదర్శి చెన్నా గోపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మొయినుద్దీన్, సతీష్, కిషోర్ పాల్గొన్నారు.

విద్యార్థుల అరెస్ట్, విడుదల



నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

333 దరఖాస్తుల పరిశీలన

బుట్టాయగూడెం : ఐటీడీఏ పరిధి ప్రభుత్వాస్పత్రుల్లో ఏఎన్ఎం, స్టాఫ్‌నర్స్, ఫార్మాసిస్ట్ పోస్టుల భర్తీకి డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎం.రాథోడ్, ఏపీఓ పి.శ్రీనివాసరావు, పీఎంఆర్‌సీఏఎంఓ కె.లింగరాజులు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 333 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఏఎన్ఎం ఆరు పోస్టులకు 88, స్టాఫ్ నర్సులు ఆరు పోస్టులకు 206, ఫార్మాసిస్టు నాలుగు పోస్టులకు 39 మంది గిరిజన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ అభ్యర్థులతో ఐటీడీఏ కార్యాలయం కిటకిటలాడింది. ఇప్పటికే ఔట్‌సోర్సింగ్‌లో సెకండ్ ఏఎన్ఎంలుగా చేస్తున్న అభ్యర్థులు తమకు ప్రాధాన్యత ఇవ్వలేదని, మెరిట్ లిస్ట్‌లో ఒకటి నుంచి 20 పేర్ల వరకే ప్రాధాన్యత ఇచ్చారని డిప్యూటీ డీఎంహెచ్‌వో వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తాము నిబంధనల ప్రకారమే ఇంటర్వ్యూలు నిర్వహించామని రాథోడ్ తెలిపారు.

ముగిసిన బదిలీల కౌన్సెలింగ్

- ఊపిరి పీల్చుకున్న విద్యాశాఖ అధికారులు
- పెదవి విరిచిన ఉపాధ్యాయ సంఘాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) :

వేసవిలో జరగాల్సిన ఉపాధ్యాయుల బదిలీలు ఇదిగో అదిగో అంటూ, వివిధ సాంకేతిక కారణాలతో పలు సవరణలు, మరెన్నో మెమోలతో ఆలస్యంగా ప్రారంభమైంది. ప్రారంభం నాటి నుంచీ సాంకేతిక సమస్యలు ఎదురైనా ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సజావుగా నిర్ణీత సమయానికి సోమవారం ముగించారు. ఈ నెల 22న ప్రారంభమైన ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో నిత్యం సాంకేతిక సమస్యలు తలెత్తినప్పటికీ గడువులోపే ముగిసింది. వెబ్ సైట్ సమయానికి తెరుచుకోకపోవడం, ఎడిట్ ఆప్షన్ జిల్లా విద్యాశాఖ అధికారికి లేకపోవడంతో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడం కోసం పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను సంప్రదించాల్సి రావడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జాబితా ప్రకారం ముందుగా కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు కోరుకున్న ప్రాంతాలు జాబితా నుంచి తొలగిపోవాల్సి ఉండగా అవీ ప్రదర్శితం కావడంతో ఉపాధ్యాయులకు, అధికారులకు తలనొప్పిగా పరిణమించాయి. ఇక రెవెన్యూ పంచాయతీలోని రెండు మూడు గ్రామాలను వేరువేరుగా చూపాల్సి ఉండగా ఆయా గ్రామాలన్నీ ఒకే రెవెన్యూ పంచాయతీగా చూపడం వల్ల ఉపాధ్యాయులు నష్టపోయారు. ఈ ఆప్షన్‌ను సరిచేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరినా ఫలితం లేకపోయింది. దీంతో స్పెషల్ గ్రేడ్ టీచర్ల కౌన్సెలింగ్ రెండు రోజులు ఆలస్యంగా ప్రారంభమై కేవలం మూడు రోజుల్లోనే 305 మందికి కౌన్సెలింగ్ పూర్తిచేశారు.


తమ వంతు కోసం నిరీక్షణ

బదిలీలు ఇలా..

ఉపాధ్యాయులు		దరఖాస్తు దారులు	రిక్వెస్ట్ చేసుకున్నవారు	బదిలీ అయినవారు	గైర్హాజరు
గ్రేడ్–2హెచ్ఎం	137	23	114	84	23
ఎస్ఏ గణితం	732	431	301	474	36
ఎస్ఏపీఎస్	523	321	202	371	57
ఎస్ఏబీఎస్	492	311	181	367	37
ఎస్ఏ సోషల్	391	197	194	278	62
ఎస్ఏపీడీ	57	49	8	56	1
ఎస్ఏ తెలుగు	229	67	162	165	10
ఎస్ఏ హిందీ	141	73	68	105	8
ఎస్ఏ సంస్కృతం	19	7	12	13	1
ఎల్‌పీ తెలుగు	211	155	56	181	4
ఎల్‌పీ హిందీ	178	114	64	140	8
ఎల్‌పీ సంస్కృతం	02	0	2	1	0
పీఈటీ	191	135	56	163	1
ఎల్‌ఎఫ్ఎల్‌హెచ్ఎం	149	24	125	84	14
ఎస్‌జీటీ తెలుగు	3174	1510	1664	1965	731
ఎస్‌జీటీ ఉర్దూ	9	2	7	5	0
ఎస్ఏ ఉర్దూ	1	1	0	0	1
ఎస్ఏ గణితం	1	1	0	0	1
ఎస్ఏ సోషల్	1	1	0	0	1
మొత్తం	6638	3422	3216	4452	996

సహకరించిన ఉపాధ్యాయులు



కౌన్సెలింగ్‌కు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పూర్తిగా సహకరించడంతో గడువులోగానే ఈ ప్రక్రియను పూర్తి చేయగలిగాం. కొన్ని విషయాల్లో అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధానం అమలు చేస్తున్నందున సకరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారు. బదిలీలు సజావుగా సాగడంలో కీలకంగా వ్యవహరించిన విద్యాశాఖ ఉద్యోగులు అభినందనీయులు.

– ఆర్ఎస్ గంగాభవాని, జిల్లా విద్యాశాఖాధికారి

నూరు శాతం రిలీవ్ చేయాలి



బదిలీలకు సంబంధించి ప్రభుత్వం కొన్ని పోస్టులను బ్లాక్ చేయడంతో కొందరు ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారు. తిరిగి బదిలీ అయినవారిలో రిలీవర్లు లేకపోతే 50 శాతం మందినే రిలీవ్ చేయాలనే నిబంధన విధించడం సరికాదు. వెంటనే నూరు శాతం బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాల్సిందే. సాంకేతిక లోపాల వల్ల కొన్ని స్థానాలు ప్రదర్శితం కాకపోవడంతో నష్టపోయిన ఉపాధ్యాయులకు విద్యాశాఖ కమిషనర్‌తో సంప్రదించి వారు కోరుకున్న స్థానాలు కల్పించాలి.

– షేక్ సాబ్జీ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

సమస్యలు పునరావృతం కాకూడదు



బదిలీల కౌన్సెలింగ్‌లో తీవ్ర అసౌకర్యానికి గురిచేసిన సాంకేతిక సమస్యలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలి. వెబ్‌సైట్ తెరుచుకోకపోవడంతో ఇటు ఉపాధ్యాయులు, అటు అధికారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. సమస్య తలెత్తితే గంటన్నర పాటు ఆగిపోవాల్సి వచ్చింది. ఆనెక్షర్లు రాలేదని ఉపాధ్యాయులు కంగారు పడాల్సిన అవసరం లేదు. ముందుగా బదిలీ అయిన స్థానాల్లో విధుల్లో చేరిపోవాలి.

– పి.వెంకటేశ్వరరావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

సాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు

ఏలూరు :

జిల్లాలో రైతులకు సాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టరు కాటంనేని భాస్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రతి ఎకరాకూ పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

- ఏలూరు మండలం గొల్లాయిగూడెం నుంచి పెదపాడు మండలం వంగాయగూడెం వరకు ఆక్రమణకు గురైన పంట కాలువను ప్రక్షాళన చేయాలని పోతర్లంక పరమేశ్వరరావు, ఎం.రంగబాబు, డి.నాగరాజు తదితరులు కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సుమారు 600 ఎకరాలకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.
- ఏలూరు మండలం మాదేపల్లి, లింగారావుగూడెం, శ్రీపర్రు కాలువకు నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు ఎనికేరాజు, ఎం.జాను, తేరా జాను తదితరులు కలెక్టరును కోరారు.
- భీమవరం 13వ వార్డు యర్రంశెట్టివారి వీధిలో డి.పట్టాభూమిలో అక్రమ భవన నిర్మాణినికి టౌన్ ప్లానింగ్ అధికారులు సహకరిస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని కర్రి ప్రేమకుమార్ ఫిర్యాదు చేశారు.
- సీతంపేట గ్రామంలో మంచినీటి కుళాయి కనెక్షన్ కోసం రూ.3,200 తీసుకుని పంచాయతీకి జమ చేయలేదని, వివిధ రూపాల్లో వచ్చిన పన్నుల సొమ్ము పక్కదారి పడుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంకు చెందిన కె.దాసు రామకృష్ణ, కె.వెంకటలక్ష్మి, మారెం కోటేశ్వరరావు, కోలా రంగబాబు కలెక్టరును కోరారు. మీ కోసంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ పి.కోటేశ్వరరావు, జేసీ–2 ఎంహెచ్ షరీఫ్, డీఆర్ఓ కె.హైమావతి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసులు, డ్వామా పీడీ ఎం.వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎసీ సీహెచ్ అమరేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.కోటేశ్వరి, మెప్మా పీడీ ఎన్.ప్రకాశరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


'మీ కోసం'లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ భాస్కర్

మీ కోసంలో కలెక్టర్ కె.భాస్కర్

ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలు

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకం, రవాణా, అమ్మకాలు సాగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ కె.భాస్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ఆయన ఫోన్ ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. తమ్మిలేరు నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిపోతోందని, దీనిని అరికట్టాలని లింగపాలెం మండలం తువ్వ చిలకరాయుడుపాలెం నుంచి వలకపల్లి నాగేశ్వరరావు కోరారు. దీంతో కలెక్టర్ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏడీ మైన్స్ సీహెచ్ మోహనరావును కలెక్టరు ఆదేశించారు. దెందులూరు మండలం చల్లచింతలపూడి పీహెచ్‌సీలో ఆయుష్ డాక్టర్‌ను నియమించాలని, ఏలూరు మండలం సత్రంపాడులో 130 చదరపు గజాల ప్రభుత్వ భూమిని అధికారులు గుత్తా పద్మావతి పేరు మీద మార్చడాన్ని నిరసిస్తూ ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై సమగ్ర విచారణ చేసి వెంటనే అవసరమైన చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వైఎస్సార్ సీపీ గూటికి శివరామకృష్ణ సోదరులు


శివరామకృష్ణ సోదరులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పార్టీ అధినేత

పెదవేగి రూరల్ : వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో ఆ పార్టీ దెందులూరు నియెజకవర్గ కన్వీనర్ కొఠారు రామచంద్రరావు, ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ కోటగిరి శ్రీధర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరి సమక్షంలో సమాచార హక్కు చట్టం తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాల అధ్యక్షునిగా పనిచేస్తున్న కమ్మ శివరామకృష్ణ, ఆయన సోదరుడు కోటేశ్వరరావు వైఎస్సార్‌సీపీలో చేశారు. ఆయనకు అధినేత కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శివరామకృష్ణ గతంలో పశ్చిమగోదావరి టీడీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. కొఠారు రామచంద్రరావు గెలుపునకు, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు. అధినేతను కలిసిన వారిలో దెందులూరుకు చెందిన కామిరెడ్డి నాని, నరసాపురం మాజీ ఎమ్మెల్యే ప్రసాదరాజు ఉన్నారు.

విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు

చాగల్లు: జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సావాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహిస్తున్నట్టు సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు సోమవారం తెలిపారు. మార్గదర్శి మహాత్మా గాంధీ అనే అంశంపై వ్యాసాలు 50 పంక్తులు మించకుండా తెలుగు లేదా ఇంగ్లిష్ భాషాల్లో రాయలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ 93900 39456లో సంప్రదించవచ్చని తెలిపారు.

లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు స్వాధీనం చేయాలి

పోడూరు : జిన్నూరులో పట్టాలిచ్చిన లబ్ధిదారులందరికీ తక్షణమే ఇళ్ల స్థలాలు స్వాధీనం చేయాలని సీపీఎం నాయకుడు కొప్పర్తి నరసింహ మూర్తి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. పార్టీ గ్రామ కార్యదర్శి నర్సింహమూర్తి, వార్డు మెంబరు పడాల పెద్దిరాజు మాట్లాడుతూ జిన్నూరులో ఇందిరమ్మ పథకంలో లబ్ధిదారులకు భూములు సేకరించి 8 ఏళ్లు, వారికి పట్టాలిచ్చి 4 ఏళ్లు అవుతోందన్నారు. అయితే ఇంతవరకు లబ్ధిదారులకు ఆ స్థలాలను అప్పగించకపోవడం చాలా దారుణమన్నారు. స్థలాలు ఇస్తే కనీసం గుడిసెలైనా వేసుకుని బతుకుతామని లబ్ధిదారులు ఎంతోకాలంగా చెబుతున్నా ప్రయోజనం లేకపోయిందన్నారు. ధర్నా అనంతరం తహసీల్దార్ కె.శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు దాతల సహకారం అవసరం

పెనుమంట్ర : మానవత సంస్థ, బ్రహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులకు సోమవారం పుస్తకాలు పంపిణీ చేశారు. పెనుమంట్ర మండల మానవత శాఖ అధ్యక్షుడు వెలగల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యామిజాల నరసింహమూర్తి, రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు తోలేటి రాంబాబు, మానవతా సంస్థ జిల్లా సంయుక్త కార్యదర్శి కర్రి వేణుబాబుల మాట్లాడారు. నెగ్గిపూడి, వనంపల్లి, కొయ్యేటిపాడు గ్రామాల్లోని పలు ప్రాథమిక పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ ఇతర విద్యా సామాగ్రిని వారు అందజేశారు. మండల మానవత కార్యదర్శి గాదె రామనాథం, కోశాధికారి దొంగ జయదుర్గా ప్రసాద్, చల్లా సాయి, సూరంపూడి కామేష్, చట్లపల్లి ప్రసాద్, వెంకట మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఎస్ఆర్ దాట్ల

పెనుమంట్రలో ఘనంగా వర్ధంతి

పెనుమంట్ర: పేద ప్రజల పక్షాన అలుపెరగని పోరాటం సాగించిన ఎస్ఆర్ దాట్ల చిరస్మరణీయుడని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, రాష్ట్ర గీత కార్మికుల సంక్షేమ సంఘం నాయకుడు ఎస్ఆర్. దాట్ల 58వ వర్ధంతి దాట్ల మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పెనుమంట్రలో నిర్వహించారు. గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ గీత కార్మికులపై ప్రభుత్వ వేధింపులకు నిరసనగా దాట్ల చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కేతా గోపాలన్ మాట్లాడుతూ దాట్ల ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున ఆయన సంస్మరనణార్ధం సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. దాట్ల కుమార్తె, అల్లుడు చిలువూరి సుందరి, రాఘురామ్‌లు దాట్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ట్రస్టీ దాట్ల కృష్ణకుమార్, సీపీఎం డివిజన్ నాయకుడు ఆకుల హరేరామ్ మాట్లాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 250 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

వేళకు బస్సులు నడపాలంటూ రాస్తోరోకో

ఆచంట :పాలకొల్లు–నరసాపురం వయా ఎ.వేమవరం మీదుగా నడిచే ఆర్‌టీసీ సర్వీసులు విద్యార్థులకు ఉపయోగపడేలా నిర్ణీత వేళలకు నడపాలని కోరుతూ వారు సోమవారం రాస్తారోకో చేశారు. ఆచంట, పెనుమంచిలి, ఎ.వేమవరం ప్రాంతాల నుంచి రోజూ అనేక మంది విద్యార్థులు పాలకొల్లు పట్టణానికి వెళుతుంటారు. కళాశాల వేళలు దృష్టిలో ఉంచుకుని గతంలో ఆర్‌టీసీ సర్వీసులు నడిపేవారని, కొంతకాలంగా ఆర్‌టీసీ వేళకు సర్వీసులు నడపకపోవడంతో ప్రయివేటు వాహనాలు ఆశ్రయించవలసి వస్తోందని విద్యార్థులు వాపోయారు. తక్షణమే ఆర్‌టీసీ అధికారులు స్పందించి ఉదయం 9.30 గంటలకు ఆచంట నుంచి నరసాపురం బయలుదేరి వెళ్లే ఆర్‌టీసీ సర్వీసును ఉదయం 8 గంటల నుంచి 8.30 గంటల సమయంలో ఆచంట–నరసాపురం వేళ్లేలా మార్చాలని, సాయంత్రం 4 గంటల తర్వాత తిరిగి పాలకొల్లు నుంచి ఆచంట చేరేలా ఆర్‌టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహింఇన కార్యక్రమం విభాగం మండల అధ్యక్షుడు ఎ.సురేష్‌బాబుతోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు

పెనుగొండ : ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయమని కాపులు ఉద్యమిస్తుంటే చంద్రబాబు నిరంకుశంగా వ్యవహరించి అణిచివేస్తున్నారని వైఎస్సార్ సీపీ పెనుగొండ పట్టణ అధ్యక్షుడు తిరుపతి వెంకటేశ్వరరావు పెద కాపు విమర్శించారు. సోమవారం పెనుగొండలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి, హామీలు అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకే కాపులకు రిజర్వేషన్ కల్పించాలని కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం పాదయాత్ర చేయడానికి ప్రయత్నిస్తే పోలీసులచేత ఉద్యమాన్ని అణిచివేయడానికి ప్రయత్నించటం దారుణమన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి చంద్రబాబు ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. హక్కులు సాధించుకునేందుకు పోరాడే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు. వీధికో పోలీసును పెట్టి టెర్రరిస్టులకన్నా దారుణంగా కాపులను చూస్తున్నారన్నారు. ఇంతటి విపత్కర పరిస్థితి ఏ రాచరికంలోనూ ఉండదన్నారు. కలబొల్లి ప్రకటనలతో, కమీషన్లతో కాలం గడుపుకు వస్తున్నారన్నారు. ప్రశ్నిస్తే దాడులు చేయిస్తున్నారన్నారు. ముద్రగడకు అందరూ బాసటగా నిలుస్తున్నారని చెప్పారు. సొంత జాతి కోసం ఉద్యమం చేస్తుంటే లేనిపోని విమర్శలు చేయించడం భావ్యం కాదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు తీరు మార్చుకోకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పార్టీ నాయకులు కొనుకు శ్రీనివాసరావు, వేండ్ర భక్త రఘునాథ్ బాబు, పప్పొప్పుల శివ, గంగిరెడ్డి శ్రీనివాసు, బండి శ్రీను, తిక్కిరెడ్డి విజయ్‌కార్తీక్, అడబాల సాయి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పెదకాపు

కళాశాల వృద్ధిలో భాగస్వాములయ్యారు

పెనుగొండ : ఎస్వీకేపీ కళాశాలల అభివృద్ధిలో ప్రతి ఉద్యోగీ భాగస్వాములై నిబద్ధతతో పనిచేయడంతో నేడు దేశంలో ఉత్తమ కళాశాలగా పేర్గాంచిందని ఆంధ్రా యూనివర్శిటీ సెనేట్ మాజీ సభ్యుడు, కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ గుబ్బల తమ్మయ్య అన్నారు. కళాశాల సూపరింటెండెంట్ దామిశెట్టి త్రిమూర్తులు, జూనియర్ అసిస్టెంట్ పెన్మెత్స అర్జునవర్మ ఉద్యోగ విరమణ సభలో కళాశాలలో సోమవారం నిర్వహించారు. వారిద్దరిని కళాశాల పాలకవర్గం ఘనంగా సత్కరించింది. ఈ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి సేవా శిబిరాలు, జాతీయ స్థాయి యువజనోత్సవాలు విజయవంతం చేయడానికి త్రిమూర్తులు కష్టపడి పనిచేశారన్నారు. కళాశాల కరస్పాండెంట్ కె.రామచంద్రరాజు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసినా కళాశాలలకు సేవలు అందించాలని కోరారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్, ప్రిన్సిపాల్ నడింపల్లి సూర్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, సంయుక్త కార్యదర్శి పెన్మెత్స వెంకటసుబ్రహ్మణ్యం, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన ఎస్వీకేపీ కళాశాల ఉద్యోగులు త్రిమూర్తులు, అర్జునవర్మను సత్కరించిన దృశ్యం

బాలలందరూ ఎమ్మార్ టీకాలు వేయించుకోవాలి

పోడూరు : 9 నెలల వయసున్న శిశువుల నుంచి 15 ఏళ్ల లోపు బాలలందరూ మీజిల్స్, రూబెల్లా (ఎమ్మార్) టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.నిహారిక సూచించారు. పోడూరులో సోమవారం ఎమ్మార్ టీకాలపై ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆగస్ట్ 1 నుంచి 8 వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఆరోగ్యసిబ్బంది వెళ్లి టీకాలు వేస్తారని నిహారిక తెలిపారు. చిన్న పిల్లలు, విద్యార్థులు టీకాలు వేయించుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వీ ఎల్‌కే రత్నకుమారి, పీహెచ్ఎన్ వై.అన్నపూర్ణ, హెల్త్ సూపర్‌వైజర్ వై.బాలచంద్రుడు, సీహెచ్ఓ ఎ.దేవదాసు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తొలగించాలి

పెనుగొండ : నడిపూడిలోని కట్టావారిపాలెం ముఖద్వారంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డువల్ల పాలెం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దానిని వెంటనే తొలగించాలని గొల్ల నాగేశ్వరరావు మీకోసంలో ఫిర్యాదు చేశారు. సోమవారం పెనుగొండ తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన మీ కోసంలో ఎనిమిది దరఖాస్తులు అందినట్టు మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.రమేష్ తెలిపారు. పెనుగొండ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు మూసివేసి నిర్మించిన షెడ్డు తొలగించాలని కడలి సత్యనారాయణ, నడిపూడి శివాలయం ఎదురుగా చెత్తను తీసివేసి శుభ్రపరచాలని మన్నే రమేష్, దొంగరావిపాలెంలో తెగిపోయిన ఎస్టీఎల్ వైర్లు వేయాలని సర్పంచ్ పమ్మి మురళీ వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఇళ్ల స్థలాలకు రెండు, వృద్ధాప్య పింఛనుకు ఒక దరఖాస్తు అందాయని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దారు బొడ్డు శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ ఎస్.వెంకట్రాజు, పంచాయతీ రాజ్ ఏఈ సీహెచ్ మణికుమార్, వ్యవసాయ శాఖ మండల అధికారి వై.రాఘవేంద్రరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోచమ్మ పాల్గొన్నారు.




పెనుగొండలో మీ కోసంలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దారు శ్రీనివాసరావు

కష్టపడితేనే ఉన్నత శిఖరాలు

ఆచంట :

విద్యార్థులు కష్టపడి చదువుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సర్పంచ్ కనపాల సర్ణకుమారి అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన ఎ.వేమవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పోత్సాహకాలు, షీల్డులు అందించారు. విద్యార్థులు నిల్లా గిరిసాయి తేజ, మల్లుల నాగసాయిదుర్గ, వీరా హేమంత్, సీహెచ్ గణేష్‌లకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శాలువాలు కప్పి సత్కరించారు. ప్రధానోపాధ్యాయిని ఐ.విజయలక్ష్మి, విద్యాకమిటీ చైర్మన్ బొక్కా శ్రీనివాసు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కోరం సాల్మన్ రాజు, టీడీపీ నాయకులు బీకే సత్యనారాయణ, డి.నాగార్జున, బీజేపీ నాయకుడు జీవీ మాధవశర్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు పోశెట్టి లీలాసుబ్బారావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు జీవీ నారాయణమూర్తి, చదలవాడ రామారావు పాల్గొన్నారు.

వెండితెర



ఆచంట

కల్యాణచక్రవర్తి	: గౌతమ్‌నంద
పెనుగొండ	
మినర్వా	: గౌతమ్‌నంద
వల్లూరు	
విజయకృష్ణ	: గౌతమ్‌నంద
పాలకొల్లు	
గీతా అన్నపూర్ణ	: ఫిదా
మారుతి	: దయానంద్
దాసరి మినీ	: వాసుకి
రంజని	: మాయామాల్
శ్రీనివాస డీలక్స్	: శమంతకమణి
శ్రీనివాస మినీ	: పటేల్‌సార్
శ్రీనివాస డీటీఎస్	: దండుపాళ్యం–2
తణుకు :	
శ్రీలక్ష్మి	: దండుపాళ్యం–2, నిన్నుకోరి
నరేంద్ర	: వాసుకి
మినీ నరేంద్ర	: మాయామాల్
వెంకటేశ్వర	: డీజే దువ్వాడ జగన్నాథం
ప్రత్యూష	: ప్రేమలీల పెళ్లిగోల, ఫిదా, శమంతకమణి
శ్రీ చిత్ర	: వైశాఖం
అత్తిలి : వెంకట్రామా	: ఫిదా
కనకదుర్గ	: దండుపాళ్యం–2

స్వతంత్ర భారత తొలి గవర్నర్ జనరల్ ఎవరు?



ఎం. వెంకటరమణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల.

జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో గాంధీజీతో పాటు పాల్గొన్న ఏకైక తెలుగు వ్యక్తి?
1) వావిలాల గోపాలకృష్ణయ్య
2) తెన్నేటి విశ్వనాథం
3) అయ్యదేవర కాళేశ్వరరావు
4) ఎర్నేని సుబ్రమణ్యం

2. కింది వాటిలో మార్కోపోలో రాసిన గ్రంథం?
1) ఏనల్స్ హిస్టరీ ఆఫ్ రాజస్థాన్
2) గైడ్ టు జాగ్రఫీ
3) ది ట్రావెల్స్ 4) నేచురల్ హిస్టరీ

3. 'ఏసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్'ను సర్ విలియం జోన్స్ ఎప్పుడు స్థాపించాడు?
1) 1784 2) 1786
3) 1788 4) 1792

4. ఉత్తర సర్కారులను ఆంగ్లేయులకు అప్పగించిన హైదరాబాద్ నిజాం ఎవరు?
1) నిజాం అలీఖాన్ 2) సికిందర్‌ఝా
3) మీర్ మహబూబ్ అలీఖాన్
4) మీర్ ఉస్మాన్ అలీఖాన్

5. కింది వాటిలో సరైన జత ఏది?
1) కాకినాడ బాంబు కేసు – ప్రతివాది వెంకట భయంకరాచారి
2) సీతానగర ఆశ్రమం – తూర్పుగోదావరి
3) చిదంబరం పిళ్లై – తిరునల్వేలి కేసు
4) పైవన్నీ సరైనవే

6. పుదుచ్చేరి ప్రాచీన నామం?
1) దేశీయకొండ పట్టణం
2) వాలికొండాపురం
3) బేతవోలు 4) రేవతీ ద్వీపం

7. ఎవరిని వివాహమాడడంతో 'ఇంగ్లండ్ రాజు రెండో చార్లెస్'కు పోర్చుగీసువారు ముంబైను కట్నంగా ఇచ్చారు?
1) కేథరిన్ 2) మేరీ
3) ఇసబెల్లా 4) విక్టోరియా

8. పోర్చుగీసువారు గోవాను శ్రీ కృష్ణదేవరాయల సహాయంతో ఏ సంవత్సరంలో ఆక్రమించారు?
1) 1509 2) 1510
3) 1515 4) 1527

9. గోండుల్లో నరబలిని నిషేధించిన భారతదేశ గవర్నర్ జనరల్ ఎవరు?
1) లార్డ్ హెన్రీ హార్డింజ్
2) చార్లెస్ మెట్‌కాఫ్
3) లార్డ్ విలియం బెంటింక్
4) లార్డ్ ఎల్లెన్‌బరో

10. భారత్‌లోనే తొలి మహిళా విశ్వవిద్యాలయాన్ని డి.కె. కార్వే ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశాడు?
1) 1914 2) 1916
3) 1918 4) 1920

11. 'మొదటి రౌండ్ టేబుల్' సమావేశాన్ని ప్రారంభించిన వారెవరు?
1) రెండో చార్లెస్
2) రెండో జేమ్స్ 3) ఐదో కింగ్ జార్జి
4) మొదటి చార్లెస్

12. పీష్వా పదవిని లార్డ్ హేస్టింగ్స్ ఏ సంవత్సరంలో రద్దు చేశాడు?
1) 1806 2) 1816
3) 1818 4) 1822

13. ఆంధ్రలో ఉప్పుసత్యాగ్రహంలో అరెస్టయిన తొలి మహిళ ఎవరు?
1) దుర్గాబాయి దేశ్‌ముఖ్
2) మాగంటి అన్నపూర్ణమ్మ
3) ఆచంట రుక్మిణీ లక్ష్మీపతి
4) యామినీ పూర్ణతిలకం

14. కింది వారిలో 'బొబ్బిలి యుద్ధం'తో సంబంధం లేని వారు?
1) తాండ్ర పాపారాయుడు
2) విజయరామరాజు
3) బుస్సీ 4) రాబర్ట్ క్లైవ్

15. జైలులో ఉండి ఐఎన్‌సీ అధ్యక్షుడిగా ఎన్నికైన వారెవరు?
1) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్
2) ఎ.సి. మజుందార్
3) మోతీలాల్ నెహ్రూ
4) చిత్తరంజన్ దాస్

16. బాలశాస్త్రి జంబేకర్ స్థాపించిన పత్రిక ఏది?
1) వృత్తాంతిని 2) దిగ్దర్శన్
3) సోంప్రకాశ్ 4) వేద ప్రకాశ్

17. ఆచార్య వినోబాభావే భూదానోద్యమాన్ని పోచంపల్లిలో ఏ తేదీన నిర్వహించారు?
1) 1950 ఏప్రిల్ 18
2) 1951 మే 16
3) 1950 మే 16
4) 1951 ఏప్రిల్ 18

18. గాంధీ–ఇర్విన్ ఒప్పందం (1931 మార్చి 5) ఎక్కడ జరిగింది?
1) వారణాసి 2) పూనా
3) వార్ధా 4) ఢిల్లీ

19. 'రాజసౌధముల నగరం' అని దేన్ని పిలిచేవారు?
1) ఉదయ్‌పూర్ 2) బొంబాయి
3) జైపూర్ 4) కలకత్తా

20. హైదరాబాద్‌లో ఏర్పడిన తొలి ప్రజా ప్రభుత్వంలో హోంశాఖ మంత్రి ఎవరు?
1) మెహదీ నవాజ్‌జంగ్
2) వినాయకరావు కొరాట్కర్
3) దిగంబరరావు బిందూ
4) జి.ఎస్. మేల్కోటి

21. 1792లో మొక్కలు నాటే శిక్ష విధించిన పాలకుడెవరు?
1) హైదరాలీ 2) టిప్పు సుల్తాన్
3) నిజాం అలీఖాన్ 4) సలాబత్ జంగ్

22. వందేమాతరం ఉద్యమ సమయంలో, 1907లో మద్రాస్ కేంద్రంగా ప్రారంభమైన బ్యాంక్ ఏది?
1) యూకో బ్యాంక్
2) ఆంధ్రా బ్యాంక్ 3) ఇండియన్ బ్యాంక్
4) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

23. సర్ థామస్ మన్రో ఎక్కడ మరణించాడు?
1) ఆధోని 2) ముండ్లపాడు
3) లక్కిరెడ్డిపల్లి 4) పత్తికొండ

24. 'స్వరాజ్' అనే మాటను ఏ ఐఎన్‌సీలో మొదటగా ఉపయోగించారు?
1) 1906 2) 1908
3) 1909 4) 1910

25. 'యంగ్ బెంగాల్ ఉద్యమం' ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?
1) 1824 2) 1826
3) 1828 4) 1832

26. కింది వారిలో 'మహర్షి' అనేది ఎవరి బిరుదు?
1) మోతీలాల్ నెహ్రూ
2) బులుసు సాంబమూర్తి
3) సి. రాజగోపాలాచారి
4) సి.ఆర్. దాస్

27. 'బెంగాల్ టైగర్' అని ఎవరిని పిలిచేవారు?
1) రాబర్ట్ క్లైవ్
2) లార్డ్ కారన్‌వాలిస్
3) లార్డ్ జార్జ్ బార్లో 4) లార్డ్ వెల్లస్లీ

28. 1773 రెగ్యులేటింగ్ చట్టంలోని లోపాలను సవరిస్తూ చేసిన చట్టం ఏది?
1) 1813 చార్టర్ చట్టం
2) 1833 చార్టర్ చట్టం
3) 1781 జుడికేచర్ చట్టం
4) 1793 చార్టర్ చట్టం

29. అగ్రకుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా కర్సన్ దాస్ ముల్జీ ఏ రాష్ట్రంలో పోరాటం చేశాడు?
1) ఒడిశా 2) గుజరాత్
3) మహారాష్ట్ర 4) బెంగాల్

30. తీర్థయాత్రలపై పన్ను రద్దు చేసిన గవర్నర్ జనరల్ ఎవరు?
1) మెట్కాఫ్ 2) ఆక్లాండ్
3) ఎలెన్‌బరో 4) డల్హౌసీ

31. భారతదేశంలో 'విప్లవాల కేంద్రం' అని పిలిచే ప్రాంతం ఏది?
1) దండి 2) చంపారన్
3) మీరట్ 4) కాన్పూర్

32. 'షాబందర్' అధికారి విధి?
1) అంతఃపుర విషయాలు
2) విద్యా విషయాలు
3) ఓడరేవు విషయాలు
4) యుద్ధ విషయాలు

33. ఫ్రెంచ్‌వారు భారతదేశాన్ని ఏ సంవత్సరంలో వదిలి వెళ్లిపోయారు?
1) 1954 2) 1959
3) 1961 4) 1962

34. శిశిరకుమార్ ఘోష్ 'అమృతబజార్' పత్రికను ఎక్కడ నుంచి ప్రచురించారు?
1) కలకత్తా 2) మద్రాస్
3) బొంబాయి 4) కాన్పూర్

35. యుద్ధాల్లో మరణించిన లేదా అంగవైకల్యం పొందిన బ్రిటిష్ సైనికుల సహాయార్థం ఏర్పాటు చేసిన నిధి?
1) వెల్లస్లీ నిధి
2) బెంటింక్ నిధి 3) మెట్కాఫ్ నిధి
4) క్లైవ్ నిధి

36. పూనా ఒప్పందం అంటే..?
1) షెడ్యూల్ కులాల వారి నియోజకవర్గాల్లో మార్పులు చేయకపోవడం
2) షెడ్యూల్ కులాల వారి నియోజకవర్గాలను జనరల్‌గా మార్పు చేయడం
3) జనరల్ నియోజకవర్గాల్లో కొన్నింటిని షెడ్యూల్ కులాల వారికి కేటాయింపు
4) షెడ్యూల్ కులాల వారికి కేటాయించిన నియోజకవర్గాలను పూర్తిగా రద్దు చేయడం

37. కింది వాటిలో సరైన జత ఏది?
1) యానాం – ఫ్రెంచ్
2) గోవా – పోర్చుగీసు
3) పులికాట్ – డచ్చి
4) పైవన్నీ సరైనవే

38. స్వతంత్ర భారతదేశ తొలి గవర్నర్ జనరల్ ఎవరు?
1) సి. రాజగోపాలాచారి
2) లార్డ్ మౌంట్‌బాటెన్
3) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్
4) కె.ఎం. ఫణిక్కర్

39. వాస్కోడిగామాకు సమకాలీనుడైన ఢిల్లీ సుల్తాన్ ఎవరు?
1) ఖిజిర్‌ఖాన్ 2) ముబారక్‌షా
3) సికిందర్ లోడి 4) ఇబ్రహీం లోడి

40. దాదాభాయ్ నౌరోజీ ఇంగ్లండ్‌లో స్థాపించిన సంస్థ ఏది?
1) ది లండన్ ఇండియన్ సొసైటీ
2) ఇండియన్ అసోసియేషన్
3) ఇండియన్ పేట్రియాట్స్ సొసైటీ
4) లండన్ పార్సీ సొసైటీ

41. అనిబిసెంట్ 'దివ్యజ్ఞాన సమాజ ప్రతినిధురాలి'గా ఏ సంవత్సరంలో బాధ్యతలు చేపట్టారు?
1) 1905 2) 1907
3) 1910 4) 1912

42. 'పాలేరు' అనే నాటకం రాసిందెవరు?
1) ఎండ్లూరి సుధాకర్
2) కత్తి పద్మారావు
3) బొజ్జా తారకం
4) బోయి భీమన్న

43. ఉప్పు తయారీ, అమ్మకాలపై గుత్తాధిపత్యం పొందిన తొలి విదేశీయులు ఎవరు?
1) పోర్చుగీసువారు
2) డచ్చివారు 3) బ్రిటిషర్లు
4) ఫ్రెంచ్‌వారు

44. కింది వాటిలో సరికాని జత ఏది?
1) ప్రఫుల్ల చంద్రరాయ్ – బెంగాల్ కెమికల్ ఫ్యాక్టరీ
2) కామన్‌వీల్ పత్రిక – అనిబిసెంట్
3) ప్రాచ్య కళల అధ్యయనం కేంద్రం – అవనీంద్రనాథ్ ఠాగూర్
4) రిప్పన్ కళాశాల స్థాపన – డబ్ల్యు.సి. బెనర్జీ

45. పోర్చుగీసువారితో పాటు క్రైస్తవ మత ప్రచారం కోసం భారత్ వచ్చిన వారెవరు?
1) హ్యూజినాట్స్
2) ప్యూరిటన్లు 3) టాబరెట్లు
4) జెస్యూట్లు

46. మైఖేల్ మధుసూదన్ దత్ ఏ భాషలో కవిత్వాన్ని వెలువరించారు?
1) కన్నడ
2) బెంగాలీ
3) పంజాబీ
4) ఒరియా

47. ఇంగ్లిష్‌వారిపై జిజియా పన్ను విధించిన మొగల్ రాజెవరు?
1) మొదటి షా ఆలం
2) బహదూర్‌షా జాఫర్
3) ఔరంగజేబు
4) షాజహాన్

48. 'అమర్ సోనార్ బంగ్లా...' గీతాన్ని రాసిన వారెవరు?
1) మైఖేల్ మధుసూదన్ దత్
2) ముల్కరాజ్ ఆనంద్
3) దీనబంధు మిత్ర
4) రవీంద్రనాథ్ ఠాగూర్

49. ఇంగ్లండ్‌లో ఉన్న 'ఇండియన్ హౌస్' ఎవరి కార్యాలయం పేరు ?
1) ఎస్.ఎ. డాంగే 2) వి.డి. సావర్కర్
3) దాదాభాయ్ నౌరోజీ
4) శ్యాంజీ కృష్ణవర్మ

50. 1930లో 'ముస్లిం లీగ్' వార్షిక సమావేశం ఎక్కడ జరిగింది?
1) పాట్నా 2) అలహాబాద్
3) లాహోర్ 4) ఢాకా

51. 'కలకత్తా చీకటి గది' ఉదంతంనాటి (1756 జూన్ 20) బెంగాల్ గవర్నర్ ఎవరు?
1) వన్సిట్టార్ 2) రాబర్ట్ క్లైవ్
3) వాట్సన్ 4) డ్రేక్

52. కింది వాటిలో సరైన జత ఏది?
1) రామ్‌గఢ్ ఐఎన్‌సీ – 1940
2) సేనాపతి బాపట్ – అభినవ భారత్
3) ఓరుగంటి వెంకటసుబ్బయ్య – పల్లిపాడు ఆశ్రమం
4) పైవన్నీ సరైనవే

53. బక్సార్ యుద్ధం ఏ తేదీన జరిగింది?
1) 1764 అక్టోబర్ 22
2) 1791 నవంబర్ 16
3) 1757 ఆగస్టు 12
4) 1765 జూన్ 20

54. సహాయ నిరాకరణ ఉద్యమ సమయంలో ఇంగ్లండ్ ప్రధానమంత్రి ఎవరు?
1) రామ్సేమాక్ డోనాల్డ్
2) లాయిడ్ జార్జి 3) గ్లాడ్‌స్టోన్
4) స్టాన్లీ బాల్డ్విన్

55. శ్రీపాద అమృతడాంగే ప్రచురించిన పత్రిక ఏది?
1) లాంగల్ 2) ది సోషలిస్ట్
3) ధూమకేతు 4) ఆత్మశక్తి

సమాధానాలు

1) 4	2) 3	3) 1	4) 1	5) 4
6) 2	7) 1	8) 2	9) 1	10) 2
11) 3	12) 3	13) 3	14) 4	15) 4
16) 2	17) 4	18) 4	19) 4	20) 3
21) 2	22) 3	23) 4	24) 1	25) 1
26) 2	27) 4	28) 3	29) 2	30) 2
31) 4	32) 3	33) 1	34) 1	35) 4
36) 3	37) 4	38) 2	39) 3	40) 1
41) 2	42) 4	43) 1	44) 4	45) 4
46) 2	47) 3	48) 4	49) 4	50) 2
51) 4	52) 4	53) 1	54) 2	55) 2

What is the average speed of..



B. Ravipal Reddy
Director, SIGMA, Hyderabad.

TIME AND DISTANCE

"Time and Distance" is important topic for bank exams and other competitive exams. Here formulas, units and unit's conversion are important topics.

1. **Formulas**
The sound system in cinema theatre is 'DTS'. It is very is to remember.
$D = T \times S$
$T = \frac{D}{S}$; $S = \frac{D}{T}$
D- Distance; T- Time, S-Speed
2. **Units**
If Distance in km and Time in hours then Speed should be in: km/hr
If Distance in meters and Time in sec. then Speed should be in: m/sec
3. **Units conversion**
1 km = 1000 m
1 hr = 3600 sec
To convert speed from km/hr to m/sec, multiply by $\frac{5}{18}$
To convert speed from m/sec to km/hr, multiply by $\frac{18}{5}$
4. If a person travelled two equal distances at '*x*' km/hr and '*y*' km/hr, then his average speed $= \frac{2xy}{x+y}$
5. If a person travelled three equal distances at '*x*' km/hr, '*y*' km/hr and '*z*' km/hr, then his average speed $= \frac{3xyz}{xy+yz+zx}$
6. If a person travelled two or more than two equal or unequal distances with different speeds, then his average speed $= \frac{\text{Total distance}}{\text{Total time}}$
7. If two persons A and B start at the same time from two points P and Q towards each other and after crossing they take T_1 and T_2 hours in reaching Q and P respectively, then
A's Speed : B's Speed $= \sqrt{T_2} : \sqrt{T_1}$
8. If the time taken is constant, the distance travelled is proportional to the speed, that is, more the speed more the distance travelled in the same time.
9. If the speed is constant, the distance travelled is proportional to the time taken, that is, more the distance travelled, more the time taken at the same speed.
10. If the distance travelled is constant, the speed is inversely proportional to the time taken, that is , more the speed, less the time taken for the same distance travelled.

BANK POs, Clerks Special
Quantitative Aptitude

EXAMPLES

1. A car covers a distance of 816 km in 12 hours. What is the speed of the car?
1) 60 km/hr 2) 62 km/hr
3) 64 km/hr 4) Can't be determined
5) None of these
Sol: Speed $= \frac{816}{12}$ =68 km/ hr *Ans: 5*
2. A car travels a distance of 75 km at the speed of 25 km/hr. It covers the next 25 km of its journey at the speed of 5 km/hr and the last 50 km of its journey at the speed of 25 km/hr. What is the average speed of the car?
1) 40 km/hr 2) 25 km/hr
3) 15 km/hr 4) 12.5 km/hr
5) None of these
Sol: Time taken to cover first 75 km of distance $= \frac{75}{25} = 3$ hrs
Time taken to cover next 25 km of distance $= \frac{25}{5} = 5$ hrs
Time taken to cover last 50 km of its journey $= \frac{50}{25} = 2$ hrs
Average Speed $= \frac{\text{Total distance}}{\text{Total time}}$
$= \frac{75+25+50}{3+5+2}$
$= \frac{150}{10} = 15$ km/hr *Ans: 3*
3. The speed of truck is $\frac{1}{3}$rd of the speed of a train. The train covers 1230 km in 5 hours. What is the speed of the truck?
1) 85 km/hr 2) 82 km/hr
3) 81 km/hr 4) 87 km/hr
5) None of these
Sol: The speed of the train
$= \frac{1230}{5} = 246$ km/hr
The speed of the truck
$= \frac{1}{3} \times 246 = 82$ km / hr *Ans: 2*
4. The average speed of a bus is 2½ times the average speed of a tractor. The tractor covers 336 km in 21 hours. How much distance will the bus cover in 12 hours?
1) 380 km 2) 440 km
3) 360 km 4) 460 km
5) None of these
Sol: The speed of the tractor
$= \frac{336}{21} = 16$ km/hr
The speed of the bus
$= \frac{5}{2} \times 16 = 40$km/hr
The bus covered distance in 12 hours = 12 × 40 = 480 km *Ans: 5*
5. A man walks at the speed of 4 km/hr and runs at the speed of 8 km/hr. How much time will the man require to cover a distance of 24 km, if he completes half of his journey (12 km) walking and half of his journey running?
1) 3 hours 2) 6 hours
3) 12 hours 4) 5 hours
5) None of these
Sol: The time of first half of his journey $= \frac{12}{4} = 3$ hours
The time of second half of his journey $= \frac{12}{8} = 1\frac{1}{2}$ hours
The time for total journey
$= 3 + 1\frac{1}{2} = 4\frac{1}{2}$ hours *Ans: 5*
6. What is the respective ratio between the speed of train and speed of a car, if the car covered 364 km in 7 hours and the train covered 195 km in 3 hours?
1) 5 : 4 2) 4 : 5
3) 13 : 5 4) 5 : 13
5) None of these
Sol: The required ratio
$= \frac{195}{3} : \frac{364}{7} = 65 : 52 = 5 : 4$ *Ans: 1*
7. A tourist bus covers a distance of 522 km at the speed of 58 km/hr in 11 hours. If the bus halted at a tourist spot in the middle of the journey, for how much time did it halt?
1) 30 minutes 2) 1 hour
3) 1 hr 30 minutes
4) 2 hours
5) None of these
Sol: The time for total journey (without halting) $= \frac{522}{58}$ =9 hours
The time for total journey (with halting) = 11 hours
The tourist bus halted time = 11 − 9 = 2 hours *Ans: 4*

Previous questions from different bank exams

1. The average speed of a bus is three-fifth of the average speed of a car which covers 3250 km in 65 hours. What is the average speed of the bus?
1) 30 km/hr 2) 20 km/hr
3) 35 km/hr 4) 36 km/hr
5) None of these
Sol: The average speed of the car
$= \frac{3250}{65}$ =50 km/hr
The average speed of the bus
$= \frac{3}{5} \times 50$ =30 km/hr *Ans: 1*
2. Two children A and B start running from the same points P along a circular path in opposite directions. The radius of the circular path is 14 meter. B's speed is 9 meter per minute and the two children meet each other after 4 minutes. What was A's speed in meters per minutes?
1) 12 2) 14
3) 11 4) 13
5) None of these
Sol: The circumference of the circular path
$= 2\pi r = 2 \times \frac{22}{7} \times 14 = 88$ meters
Distance covered by B = T× S = 4 × 9 = 36 meters
Remaining path to covered by A = 88 − 36 = 52 meter
So, A covers the distance 52 meter in 4 minutes
A's speed $= \frac{52}{4} = 13$m/min. *Ans: 4*
3. A car travels a distance of 45 km at the speed of 15 km/hr. It covers the next 50 km of its journey at the speed of 25 km/hr and the last 25 km of its journey at the speed of 10 km/hr. What is the average speed of the car?
1) 40 km/hr 2) 24 km/hr
3) 15 km/hr 4) 18 km/hr
5) None of these
Sol: Time for first 45 km $= \frac{45}{15}$ =3hrs
Time for next 50 km $= \frac{50}{25} = 2$ hrs
Time for last 25 km $= \frac{25}{10}$ =2.5hrs
The average speed:
$= \frac{\text{Total distance}}{\text{Total Time}}$
$\frac{45+50+25}{3+2+2.5} = \frac{120}{7.5} = 16$ km/hr *Ans: 5*
4. A car reached Raipur from Somgarh in 35 minutes with an average speed of 69 km/hr. If the average speed is increased by 36 km/hr, how much time will it take to cover the same distance?
1) 24 min. 2) 27 min.
3) 23 min. 4) 29 min.
5) None of these
Sol: Speed = 69 km/hr
Time = 35 minutes $= \frac{35}{60}$ hours
Distance $= \frac{35}{60} \times 69$ km/hr
Second case Speed = 69 + 36 = 105 km/hr
Second case time
$= \frac{35}{60} \times 69 \times \frac{1}{105} = \frac{23}{60} = 23$ minutes *Ans: 3*
5. A person travelled from his house to office at 15 km/hr and office to house at 60 km/hr. The time for total journey is 30 minutes. Then find the distance between house and office?
1) 6 km 2) 12 km
3) 18 km 4) 24 km
5) None of these
Sol: His average speed
$= \frac{2 \times 15 \times 60}{15+60}$
$= \frac{1800}{75} = 24$ km/hr
Time = 30 minutes = ½ hr
Total distance (house to office and office to house)
= ½ × 24 = 12 km
The distance between house and office $= \frac{12}{2} =$ 6 km. *Ans: 1*
6. A person travelled from house to office at 3 km/hr and reached his office 9 minutes late, next day he travelled from house to office at 4 km/hr and reached 6 minutes early. Find the distance between house and office?
1) 3 km 2) 5 km
3) 4 km 4) 3 ½ km
5) None of these
Sol: 1st day:
Let Distance = x km
Speed = 3 km/hr
Time $= \frac{x}{3}$ hrs
2nd day:
Distance = x km
Speed = 4 km/hr
Time $= \frac{x}{4}$ hrs
The time difference in 2 days = 9 + 6 = 15 minutes
$= \frac{15}{60}$ hrs = ¼ hrs
According to the question
$\frac{x}{3} - \frac{x}{4} = \frac{1}{4}$
$4x - 3x = 3$
$x = 3$ km *Ans: 1*

పూరించండి

కింద ఉన్న జంతువుల పేర్లు వాటికి ఎదురుగా ఉన్న ఖాళీలలో పూరించండి



G _ _ B _ _ _


_ O _ _ E

_ E _

R _ _ _ _ _ E _

_ _ _ K

దారి చూపండి..!



ఔనా!



మన కనురెప్పలపై సగటున 550 వెంట్రుకలు ఉంటాయి



ప్రాచీన ఈజిప్టులో పిల్లిని ప్రమాదవశాత్తూ చంపినా ఉరిశిక్ష విధించేవారు



చదరంగం పుట్టింది మనదేశంలోనే. కాలక్రమంలో విశ్వమంతా వ్యాప్తిచెందింది.



ప్రపంచవ్యాప్తంగా అపరిశుభ్ర నీటి కారణంగా ఏటా 34 లక్షల మంది మరణిస్తున్నారు

నాన్నా, చెప్పవా?


రాబీస్ వ్యాధి కుక్కలు కరిస్తేనే వస్తుందా?




లూయిపాశ్చర్ అనే శాస్త్రవేత్త క్రీ.శ.1885లో రాబీస్ వ్యాధికి టీకా మందుని కనిపెట్టడానికి ముందు ఈ ప్రపంచాన్ని గడగడలాడించిన వ్యాధుల్లో రాబీస్ ఎన్‌సిఫిలిటీస్ వ్యాధి కూడా ఒకటి. ఇది ఒకానొక వైరస్ ద్వారా వస్తుంది. ఈ వైరస్‌ని కలిగి ఉండే కుక్కలు మనుషులను కరిచినప్పుడు, కొరికినప్పుడు అయిన గాయాల ద్వారా వ్యాధికి సంబంధించిన వైరస్‌లు మనుషుల శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఆ తరువాత గాయం ఉన్న చోట ఉండే నాడీకణాల ద్వారా కేంద్ర నాడీమండలంలోకి చేరుకుని, శరీరంలోని అన్ని నాడుల్లోకి వైరస్ వ్యాపిస్తుంది. ఆ తరువాత దాదాపుగా మన శరీరంలోని ప్రతి అవయవం పైన వైరస్ తన ప్రభావాన్ని చూపిస్తుంది. వ్యాధి ఎంత కాలానికి మొదలవుతుంది అనేది కుక్క కరిచిన ప్రదేశంపై ఆధారపడి ఉన్నప్పటికి సాధారణంగా 8 వారాలలో వ్యాధి లక్షణాలు కనిపించడం మొదలవుతాయి. కుక్క కరిచిన చోట నొప్పి, దురదతో మొదలై క్రమక్రమంగా తలనొప్పి, వాంతులు, విరోచనాలు వంటి పలు దశలను దాటి, వివిధ రకాల మానసిక వైకల్యాలు, భయాలు మొదలవుతాయి. ముఖ్యంగా రాబీస్ వ్యాధి వచ్చిన వ్యక్తులు నీరన్నా, నీటి చప్పుడన్నా హడలిపోతారు. వ్యాధి బాగా ముదిరాక గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యవస్థకు పక్షపాతం వచ్చి వ్యాధిగ్రస్తుడు చనిపోతాడు. రాబీస్ వ్యాధి కుక్కల ద్వారానే కాక కోతులు, గబ్బిలాలు, రకూన్స్, నక్కలు, తోడేళ్లు, ముంగిసలు, ఇంకా ఇతర మాంసాహార వన్య ప్రాణుల ద్వారా కూడా మనుషులకు సంక్రమించవచ్చు. ఇలాంటి జంతువులు ఏవి కొరికినా వాటి ద్వారా కూడా రాబీస్‌వ్యాధి వచ్చే అవకాశం టుంది. అయితే పాములు, తాబేళ్లు, ఉడుతలు, కుందేళ్లు, తేనెటీగలు, పక్షులు వంటి కొన్ని జంతువులు మాత్రం రాబీస్ వ్యాధికారక క్రిమి వాహకాలుగా ఉండవు.

జవాబులు: Ans: gobbler, goose, hen, rooster, duck

ఈ రెండు బొమ్మల మధ్య ఉన్న 6 తేడాలను గుర్తించండి.




పక్కన ఉన్న నాలుగు నీడల్లో ఇక్కడ ఉన్న కుందేలు బొమ్మ అసలైన నీడ ఏదో గుర్తించండి.




బొమ్మను గీయండి - రంగులు వేయండి

కింద ఉన్న బొమ్మను చూసి, ఖాళీ గళ్లలో బొమ్మను అలాగే గీయండి. రంగులు వేయండి.



చుక్కలు కలపండి - రంగులు వేయండి





ఏలూరు కాలువ విస్తరణకు ఫ్లగ్ మార్కింగ్

ఏలూరు (ఆర్ఆర్ పేట) : జల రవాణా అభివృద్ధిలో భాగంగా జిల్లాలోని ఏలూరు కాలువ విస్తరణ పనులు త్వరలో చేపట్టనున్నట్టు ఆర్డీఓ జి.చక్రధరరావు చెప్పారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆయన స్వీకరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఏలూరు డివిజన్ పరిధిలో పెంటపాడు, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, భీమడోలు, ఏలూరు, పెదపాడు, దెందులూరు మండలాలకు చెందిన 37 గ్రామాలలో సుమారు 50 కిలోమీటర్ల మేర ఉన్న ఏలూరు కాలువ విస్తరణకు అవసరమైన భూసేకరణకు అన్ని చర్యలూ చేపడుతున్నామన్నారు. కాలువ విస్తరణకు 36 గ్రామాలకు చెందిన 510 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంటుందన్నారు. అవసరమైన స్టోన్ మార్కింగ్‌ను ఇన్ ల్యాండ్ జల రహదారుల అభివృద్ధి సంస్థ గుర్తించిందన్నారు. ఫ్లగ్ మార్కింగ్‌ను వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. సర్వేయర్లను నియమించి ఎంత మేర భూసేకరణ చేయవలసి ఉందీ, ఎన్ని ఇళ్లు కోల్పోతున్నదీ, బాధితులు ఎంత మంది అనే విషయం గుర్తిస్తామన్నారు. జూలైలో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో సుమారు 20 వేల మంది కొత్త ఓటర్లు నమోదు అయ్యారన్నారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం సోమవారంతో ముగిసిందని, అయితే కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకునే కార్యక్రమం నిరంతర ప్రక్రియన్నారు.

నిట్‌లో ముగిసిన సీశాబ్ ప్రత్యేక రౌండ్
మరో వంద మంది విద్యార్థులు ఏపీ నిట్‌లో చేరే అవకాశం

తాడేపల్లిగూడెం : ఏపీ నిట్‌లో చేరడానికి అర్హత కలిగిన వారికి సీశాబ్ పేరిట నిర్వహించిన ప్రత్యేక రౌండ్ కౌన్సెలింగ్ ముగిసింది. సుమారు మరో 100 మంది విద్యార్థులు ఏపీ నిట్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయని రెసిడెంట్ కో–ఆర్డినేటర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఫిజికల్ రిపోర్టింగ్‌కు తుది గడువు ఆగస్ట్ రెండో తేదీ వరకు ఇచ్చారు. కొత్తగా అవకాశం వచ్చిన విద్యార్థులు నిట్ కార్యాలయ పని వేళల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. నిట్‌లో 480 సీట్లు ఉండగా, ఏడు రౌండ్లు ముగిసేసరికి 348 మంది విద్యార్థులు ఫిజికల్ రిపోర్టింగ్ చేశారు. రిపోర్టింగ్ చేశాక కూడా 50 మంది వేరే కళాశాలలకు వెళ్లిపోయారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కొత్తగా 70 మంది విద్యార్థులు వచ్చి ఏపీ నిట్‌లో చేరారు. దీంతో ఇప్పటి వరకు చేరిన విద్యార్థుల సంఖ్య 368కి చేరింది. కొత్త విద్యార్థులు చేరే సరికి నిట్‌లో పది పన్నెండు సీట్లు మాత్రమే మిగులుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపు సాయంత్రానికి మిగుల సీట్ల పూర్తి సమాచారం వెలువడనుంది.

కార్పొరేట్ సొసైటీ



కోపల్లె సహకార సంఘ భవనం లోపల ఇలా..

వాణిజ్య బ్యాంకులకు దీటుగా కోపల్లె కో-ఆపరేటివ్ సొసైటీ

కాళ్ల :

కోపల్లె విశాల సహకార పరపతి సంఘం వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలందిస్తూ దినదిన ప్రవర్ధమానం అవుతోంది. ఈ సొసైటీ భవనం, కార్యకలాపాల నిర్వహణ చూస్తే కార్పొరేట్ సొసైటీ అనేలా ఉంటుంది. 1956లో 20 మంది రైతులతో ప్రారంభమై నేడు 2070 మంది సభ్యులతో రూ.1,56,33,190 షేరు ధనం కలిగి ఉంది. 1956 నుంచి ఇప్పటి వరకూ 12 సార్లు ఈ సొసైటీకి జరిగిన ఎన్నికలు అన్నీ ఏకగ్రీవమవ్వడం మరో విశేషం. సొసైటీ పరిధిలో 11 గ్రామాలున్నాయి. డిపాజిట్లు రూ.18,82,36,532 కాగా డీసీసీబీలో ఇన్వెస్ట్ చేసిన మొత్తం రూ.9,37,15,178.96. రుణ మొత్తం రూ.28,17,43,062. సొసైటీ ద్వారా ఎరువులు, పురుగుమందులు, నిత్యావసర వస్తువులు, సిమెంట్‌ను దీని పరిధిలోని గ్రామాల రైతులకు, ప్రజలకు సరసమైన ధరలకు అందిస్తున్నారు. ఈ వ్యాపారం వార్షిక టర్నోవర్ సుమారు రూ.1.50 కోట్లు. ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా రూ.40 లక్షలు లాభం ఆర్జిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం ఈ సంఘానికి నికర లాభం రూ.67,38,794 వచ్చింది. గతంలో ఉన్న అధ్యక్షులు దంతులూరి కోటేశ్వరరాజు ఆధ్వర్యంలో కొత్త భవనం నిర్మించారు. 2013లో అధ్యక్షుడిగా ఎన్నికైన నంద్యాల రామరాజు హయాంలో బ్యాంక్ సేవలను మరింత విస్తృతం చేశారు. సీజీఎఫ్ నిధులతో బొండాడలో ఆర్వో ప్లాంట్ నిర్మించారు. సంఘ పరిధిలోని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు కొంత నిధిని ఏర్పాటు చేశారు. నిత్యావసర వస్తువులు రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో జిల్లాలో మొట్టమొదటి సారిగా సంఘ పరిధిలో బొండాడలో సూపర్ మార్కెట్ ఏర్పాటు చేశారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్నారు. ప్రజలకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. సిమెంట్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో తక్కువ ధరలకే అందిస్తూ ప్రశంసలు పొందుతున్నారు. ఇటీవల బ్యాంకు నిధులు రూ.45 లక్షలతో సహకార సంఘ కార్యాలయాన్ని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. 60 ఏళ్ల నుంచి కోపల్లె సహకార సంఘం ఎ గ్రేడ్‌లో కొనసాగుతుండటం విశేషం.

సమష్టి కృషితో రైతులకు సేవలు



సంఘ సభ్యులు, అధికారులు, రైతులు, డీసీసీబీ చైర్మన్ సమష్టి కృషితో రైతులకు సేవలు అందించగలుగుతున్నాం. సంఘానికి వచ్చిన లాభాలను సభ్యులైన రైతులకు పంపిణీ చేస్తున్నాం. తక్కువ ధరలకే ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నాం. అంతేగాకుండా సరసమైన ధరలకు రైతులకు సిమ్మెంట్‌ను అందిస్తున్నాం.

– నంద్యాల రామరాజు, అధ్యక్షుడు, కోపల్లె సొసైటీ

రాజకీయ చైతన్యమే కారణం



కోపల్లె గ్రామంలో రైతులు, నాయకులు రాజకీయ చైతన్యం కలిగి ఉండడంతో సొసైటీ ఎన్నికలు ఎప్పుడూ ఏకగ్రీవం అవుతున్నాయి. అధ్యక్షుడు సమర్థుడు కావడంతో సహకార సంఘాన్ని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. గతంలో పనిచేసిన అధ్యక్షులు సంఘాన్ని అభివృద్ధిలోకి తీసుకువచ్చారు. సంఘాల ద్వారా వ్యవసాయ, ఆక్వా రైతులకు రుణాలు అందిస్తున్నాం. కాపు, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ రుణాలు అందించే సదుపాయం కల్పిస్తున్నాం.

– ముత్యాల వెంకటేశ్వరరావు, చైర్మన్, డీసీసీబీ

శ్రావణమాసం.. శివ నామస్మరణ

భీమవరం (ప్రకాశం చౌక్) : శ్రావణ మాసం మొదటి సోమవారం శివనామ స్మరణతో శివాలయాలు మార్మోగాయి. పంచారామక్షేత్రం గునుపూడి శ్రీఉమ సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేకంగా పుష్పాలంకరణచేసి పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో నల్లూరి సతీష్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భీమేశ్వరస్వామికి రుద్రాభిషేకం

శ్రావణ మాసం సోమవారం సందర్భంగా భీమేశ్వరస్వామికి ప్రత్యేకంగా రుద్రాభిషేకం, పంచామృత అభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారికి దర్శించుకున్నారు.



భీమవరం భీమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న అర్చకులు

పోలీసుల ఉద్యోగ విరమణ.. ఆత్మీయ వీడ్కోలు

ఏలూరు అర్బన్ : ఎన్నో సవాళ్లు, ఒత్తిళ్లతో దాదాపు 30 ఏళ్ల సర్వీసు విజయవంతంగా పూర్తి చేసుకున్న పోలీసు ఉద్యోగులు అభినందనీయులని జిల్లా ఎస్పీ ఎం.రవిప్రకాష్ అన్నారు. సోమవారం పోలీసు సర్వీసు నుంచి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం సమావేశ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగ విరమణ చేసిన జిల్లా పోలీస్ కార్యాలయ సూపరింటెండెంట్ సీహెచ్ నాగమణి, ఏఎస్సైలు కె.సూరపరాజు (పెంటపాడు), పీవీవీఎల్‌పీ రామం (పోలవరం), హెచ్‌సీలు బి.సాయిబాబా (పెరవలి), ఎంఎస్ఎస్‌వి విశ్వేశ్వరరావు (డీసీఆర్‌బీ)ను సత్కరించారు. అడిషనల్ ఎస్పీ వెలిశెల రత్న, ఏఆర్ ఆర్‌ఐ కె.వెంకటరావు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు, కె.నాగరాజు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ ఉద్యోగులను సత్కరించిన ఎస్పీ రవిప్రకాష్

అమ్మపాలు అమృతం

నిడమర్రు, నిడదవోలు రూరల్ :

తల్లి పాల విశిష్టత, ప్రాముఖ్యతను చాటేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి వారం రోజుల పాటు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆగస్ట్ 1న ప్రపంచ వ్యాప్తంగా తల్లిపాల దినోత్సవం జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో మన ఐసీడీఎస్ అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్ట్ మొదటి వారంలో వారోత్సవాలు చేపడుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే గ్రామ, మండల, జిల్లాస్థాయిలో కార్యక్రమాలు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించడానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో నాలుగు రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య శాఖ అనుబంధంతో ఈ కార్యక్రమాలను చేపట్టనున్నట్టు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

ముర్రు పాలు తప్పనిసరి

బిడ్డ పుట్టిన మొదటి అరగంటలోపు తల్లులకు వచ్చే పాలను ముర్రుపాలు అంటారు. ఇవి కచ్చితంగా శిశువుకు పట్టాలని ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.అర్చన సూచిస్తున్నారు. దీనివల్ల రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకాహార పదార్థాలు అందుతాయని, ఇందులో మాంసకృతులు, విటమిన్ ఏ ఉంటాయని తెలిపారు. ఆమె మరికొన్ని సూచనలు చేశారు.

- వ్యాధులు రాకుండా ముర్రుపాలు బిడ్డకు జీవిత కాలం కాపాడుతాయి.
- శిశువు పేగులను శుభ్రం చేసి, మొదటి మల విసర్జనకు తోడ్పడతాయి.
- తల్లులు సహజంగా బిడ్డకు సరిపడా పాలురావడం లేదని అనుకోవడం అపోహ మాత్రమే.
- బిడ్డ పుట్టగానే పాలు మూడు, నాలుగు రోజుల వరకు పడవని తేనె నాకించడం, పంచదార నీళ్లు ఇవ్వడం, గ్లూకోజ్ నీళ్లు ఇవ్వడం చెయ్యకూడదు.
- బిడ్డకు పాలు పట్టించడం వల్ల తల్లికి కలిగే లాభాలు
- తల్లులు చనుబాలు ఇవ్వడం వల్ల గర్భధారణ తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గడంతో పాటు త్వరగా కోలుకుంటారు. జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు.
- చనుబాలు ఇచ్చినందువల్ల ఊబకాయం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. గర్భానికి పూర్వం ఉన్న బరువును తిరిగి పొందగలుగుతారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు



తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానం. శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు దోహదం చేయడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అందుకే తల్లి పాలను బిడ్డ పుట్టిన వెంటనే పట్టిస్తారు. పాలు పట్టడంతో అటు తల్లికీ అనేక లాభాలున్నాయి. రోగనిరోధక శక్తిని పెంపొందించి ఎన్నో రకాల వ్యాధులు రాకుండా ఉంటాయి. తల్లిపాలకు ఇంతటి విశిష్టత ఉండబట్టే వైద్యులు, ప్రభుత్వం మహిళలల్లో చైతన్యం కలగజేస్తోంది. నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు జరుగుతున్నాయి.

- బిడ్డకు పాలు పట్టించడం వల్ల రొమ్ము, గర్భసంచి క్యాన్సర్లు రావు
- తల్లులకు మలి వయసులో వచ్చే ఆస్టియోపొరొసిస్ (ఎముకల బలహీనత) నుంచి కాపాడుతుంది.
- ఆరు నెలల వరకు బిడ్డకు తప్పనిసరిగా రోజుకు 8 నుంచి 10 సార్లు పాలు ఇవ్వాలి.

తల్లి పాలతో బిడ్డకు కలిగే లాభాలు

- తల్లి పాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి.
- నాణ్యమైన ప్రొటీన్లు, ఒమెగా 3, 6, 9 బిడ్డ మెదడుకు వికాసానికి తోడ్పడతాయి.
- ఈ పాలలో బిడ్డలకు అవసరమయ్యే విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.
- ఇందులోని లాక్టోజ్ వల్ల కాల్షియం నిల్వలు పెరుగుతాయి, బిడ్డను రక్తహీనత నుంచి కాపాడతాయి.
- తొలి నెలలో శిశువులకు వివిధ రకాల అంటువ్యాధుల బారి నుంచి కాపాడుతాయి.
- బిడ్డ మనోవికాసానికి తోడ్పతుతాయి.
- బిడ్డ మల విసర్జనకు, మలబద్ధకం సమస్య నివారణకు తోడ్పడతాయి. జీర్ణ మండలాన్ని వృద్ధి చేస్తాయి.

వ్యాధులు దూరం

తల్లిపాలలో విటమిన్లు, మాంసకృతులు, కార్బోహైడ్రేడ్స్, కొవ్వు పదార్థాలు, మినరల్స్, ఎ, బీ, సీ,డీ, కె విటమిన్లు, హిమోగ్లోబిన్, నీటి శాతం అధికంగా లభిస్తాయి. అందువల్ల పిల్లలకు ఎక్కువగా వ్యాధులు రావు. బిడ్డకు సమతుల ఆహారం అందుతుంది. పోతపాలతో బిడ్డల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కాలేయం, ఊబకాయం రావడం, షుగర్ వ్యాధి సమస్యలు వేధించే అవకాశం ఉంది. ఇక తల్లి పాలని తాగే పిల్లల్లో దీర్ఘ కాలిక రోగాలు, కామెర్లు వచ్చే అవకాశం ఉండదు.

ఔషధమిలా..

అమ్మపాలలో 60–80 శాతం నీళ్లుంటాయి.100 ఎంఎల్ పాలల్లో 1.1 గ్రాముల ప్రొటీన్‌లు, 6.5 గ్రాముల లాక్టోస్, 3.5 గ్రాముల కొవ్వు పదార్థాలుంటాయి. ఎముకలకు అవసరమైన కాల్షియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటుంది. రక్తం పెరిగేందుకు ఐరన్ 0.29 ఎంజీ, పొలిక్‌యాసిడ్ 0.14 యూజీ (మైక్రోగ్రామ్ కన్నా తక్కువ) విటమిన్ బి–120.45 యూజీ, విటమిన్ సీ 1.2 ఎంజీ. విటమిన్ ఏ 0.5 ఐయూ (ఇంటర్నేషనల్ యూనిట్స్), విటమిన్–డి 0.5 ఐయూ, విటమిన్ కే 1.5 యూజీ తదితర పోషకాలుంటాయి. అందుకే ఇవి దివ్య ఔషధంతో సమానం.

నేటి నుంచి వారోత్సవాలు



తల్లిపాల విశిష్టతను ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆగస్ట్ 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. వారోత్సవాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ముందస్తుగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాం. వారు మహిళలకు అవగాహన కల్పిస్తారు.

– కేపీవీఎల్ పద్మావతి, సీడీపీవో, గణపవరం

పోషకాహారం తీసుకోవాలి



తల్లి పాలు పుష్కలంగా రావాలంటే గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లిపాయ, తాజా కూరగాయలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి. పండ్లు శుభ్రంగా కడిగిన తర్వాత తినాలి.

– ఎస్.అర్చన, ప్రసూతి వైద్య నిపుణులు, ఉంగుటూరు

నాటకాల్లో మెగాస్టార్ మద్దాల





ఏఎన్ఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మద్దాల రామారావు



వివిధ వేషధారణల్లో మద్దాల

తాడేపల్లిగూడెం : దేశ రాజధాని హస్తినాపురంలో ఆయన నాటకం ఆడుతుంటే ప్రేక్షకులు క్యూ కట్టేవారు. 40 ఏళ్ల క్రితం ఆయన డ్రామా చూడాలంటే అక్షరాలా రూ.150 పెట్టి టిక్కెట్ కొనుక్కోవాల్సిందే. నాటకాల్లో దేశాన్ని రంజింప చేసిన వ్యక్తి మహానటుడు మద్దాల రామారావు. నాటక చరిత్ర పుటల్లో ఆయన మెగాస్టార్‌గా చిరస్థాయిగా నిలిచారు. భూకైలాస్ సినిమాలో ఎన్టీఆర్‌ను, భూకైలాస్ నాటకంలో మద్దాలను పాత్రల్లో చూస్తే ఎన్టీఆర్ కంటే బాగా చేశాడనే కితాబులను ఎన్నోసార్లు మద్దాల రామారావు పొందారు. అంతే కాదు ఎన్టీఆర్ స్వయంగా మద్దాలను ఇంటికి పిలిపించుకుని భూకైలాస్‌లోని డైలాగ్‌లు చెప్పించుకున్నారంటే ఆయన నటనా కౌశలం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అత్తిలిలో టేకు ఫకీర్ స్కూల్, రేలంగిలో ప్రగడ భద్రం నాటక పాఠశాల నాటకాన్ని, పాత్రలను అజరామంగా ప్రేక్షకుల మదిలో కలకాలం నిలిచేలా చెక్కారు.

జల్లికొమ్మరలో జననం

తాడేపల్లిగూడెం సమీపంలోని జల్లికొమ్మరలో 1927లో జన్మించిన మద్దాల ఎనిమిదేళ్లప్రాయంలో నాటక రంగ ప్రవేశం చేశారు. అత్తిలికి చెందిన టేకు ఫకీర్ నాటక ట్రూపులో లవకుశ నాటకంలో లవుడిగా పాత్రను పోషించిన ఆయన ఇక వెనుతిరిగి చూసుకోలేదు. రేలంగికి చెందిన ప్రగడ భద్రం ఆధ్వర్యంలోని హిమగిరీశ నాట్యమండలిలో భద్రం రచించి, రూపొందించిన తులసీ జలంధర నాటకం రామారావుకు స్టార్ ఇమేజ్‌ను తీసుకొచ్చింది. తులసీ జలంధర, మైరావణ, భూకైలాస్ నాటకాలతో దేశ వ్యాప్తంగా రామారావు నాటకాలను ప్రదర్శించారు. అప్పట్లో 32 రోజులు 32 గ్రామాల్లో నాటకాలను ప్రదర్శించిన ఏకైక నటుడు మద్దాల రామారావు. ఒక్కోసారి ప్రేక్షకులు కిక్కిరిసిపోయి నాటకం చూసే అవకాశం లేకపోవడంతో తెరలను తీసి వేసి నాలుగువైపులా నాటకం కనిపించేలా ఏర్పాటు చేసిన ఘనత ఒక్క మద్దాల రామారావు నాటకానికే ఉంది. జలంధర, మైరావణ, రావణాసురుడు, తాండ్ర పాపారాయుడు, భస్మాసుర, కర్ణుడు, యయాతి, విశ్వామిత్ర వంటి పాత్రలతో ఏడు వేలకు పైగా నాటకాలను ఆయన ప్రదర్శించారు. 84 ఏళ్ల వయసుతో వయోభారం కారణంగా ఇంటి వద్ద కొంతకాలంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో సోమవారం తుదిశ్వాస విడిచారు.



ప్రేమాభిషేకం

బెలూన్‌లో నవజంట

బాక్స్‌లో వధువు

బుట్టలో పెళ్లికూతురు

కళ్యాణ వైభోగమే

పెళ్లంటే మూడు ముళ్లు.. ఏడడుగులే కాదు.. ఇద్దరి జీవితాల నూరేళ్ల పంట. పెళ్లితో ఒక్కటై కొత్త జీవితాలను ఆరంభించే యువజంటలు తమ వివాహాన్ని జీవితకాలం గుర్తించుకునేలా ఘనంగా జరుపుకోవాలని తహతహలాడుతుంటారు. ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుకావడం, ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో కల్యాణ తీరుతెన్నుల్లో ఇటీవల భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. స్థితిమంతుల ఇంట జరుగుతున్న వివాహాల్లో విఘ్నేశ్వర పూజ, సుముహూర్తం, కన్యాదానం, ప్రదానం.. వంటి సంప్రదాయాలతో పాటు ఆధునిక హంగులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పెండ్లి కుమారుడు, కుమార్తెల మధ్య బాక్స్ గేమ్, కృత్రిమంగా మేఘాల సృష్టి, బావ గారి కాశీయాత్ర ట్రెండ్, గొడుగులకు సొబగుల తళుకులు, సినిమాటిక్‌గా బెలూన్ల నుంచి వధూవరుల ప్రత్యక్షం, పెళ్లికి సంబంధించి టీజర్ విడుదల.. వంటి నయా ట్రెండ్‌లు ఆహుతులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి.

– తాడేపల్లిగూడెం



కళారాధన

పాలకొల్లు సెంట్రల్ :

స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కళారాధన నివేదన కార్యక్రమంలో భాగంగా నరసాపురం తోలేటి శ్రీనివాస్ బృందంచే భక్తి గీతాలాపన కార్యక్రమం జరిగింది. దాతల సహకారంతో సుమారు 500 భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి పంచహారతుల కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శివదేవకు పూజలు

పాలకొల్లు అర్బన్ :

వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవుని చిక్కాలలోని శివదేవస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. పార్వతీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు శాంతిహోమాలు,అభిషేకాలు చేయించుకున్నారు. సంతాన ప్రాప్తి కోసం దంపతులు ఆలయ ఆవరణలో కొబ్బరిమొక్కలు నాటారు, ఆలయ ఈవో చిట్టూరి వెంకటేశ్వరరావు, అర్చకులు ర్యాలి శివాజీ, ర్యాలి కాశి, ర్యాలి సతీష్, ర్యాలి సూర్యప్రకాశరావు భక్తులకు సేవలందించారు.

